*Licensed to post with payment at RMS, Hyd*




## చెత్తకుండీల్లో ప్రత్యక్షమవుతున్న శిశువులు
## అసహజ బంధాలకు ఆనవాళ్లు


## UDBHAVA

Edited, Printed, Published and owned by **Dr. M. Madhava Vasu** and Printed at Saraswathi Printers, Plot No.1, 1-24-21/4, (24-387), Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015. Telangana and Published at Plot No.1, 1-24-21/4, (24-387), Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015, Telangana.

Editor : Dr. M. Madhava Vasu,

RNI No: 87195 (APTEL/2005/14638)

Phone: 040-27960130 - Mobile : +91 9848861801

email: madhavvasumanchiraju@gmail.com




సుప్రీంకోర్టు సిజెగా జస్టిస్ బి.ఆర్.గవాయ్

# ఉద్భవ

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం / స్వేచ్ఛ / హక్కుల మాసపత్రిక


Volume : 19 Issue: 2 May 2025 Pages: 72 Rs.10





# దక్షిణాది రాష్ట్రాలే టాప్

పోలీసు వ్యవస్థ సామర్థ్యంలో తెలంగాణ, ఆంధ్ర తొలి రెండు స్థానాలు

ఇండియా జస్టిస్ రిపోర్ట్ - 2025 స్కోర్‌కార్డ్

# ఉద్భవ

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం /
స్వేచ్ఛ / హక్కుల మాస పత్రిక

Regn. No. 87195 (APTEL/2005/14638)

**Volume:19 Issue: 2 * May 2025 * Pages: 72 Rs.10**



Founder and Editor in Chief

**Dr. M. Madhava Vasu**

M.A., M.H.R., M.Phil (JMC), P.G.H.R., Ph.D., F.D.R. (Nalsar), B.P.R., DEE.

**Advisors:**

**Sri M. Madhusudhan Reddy**
Advocate

**Sri P. Balreddy**
Advocate

**Sri S. Mohan Rao**
Journalist

Kakinada Correspondent :
**Sri D. Venugopal Rao**


## లోపలి పేజీల్లో...


- దక్షిణాది రాష్ట్రాలే టాప్ 3
- మూడేళ్లలో ఏపీ పోలీసుల్లో 33% మహిళలు 6
- పోలీసుశాఖలో మహిళా ప్రాతినిధ్యం అంతంతమాత్రమే 10
- అభివృద్ధి బాటలో భారత్ 12
- వేగం పుంజుకున్న మహిళా సాధికారత 13
- సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్ 16
- సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి 20
- పిల్లల అక్రమ రవాణా జరిగితే ఆస్పత్రుల లైసెన్స్ రద్దు 24
- కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్ వద్దు 32
- స్కూల్లో విద్యార్థినికి 'నెలసరి' వివక్ష 54



**UDBHAVA**
Edited, Printed, Published and Owned by **Dr. M. Madhava Vasu**
Published at 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015, Telangana, India. Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com


**UDBHAVA**
Carries proudly the messages of society of all sections of people, especially women and children, downtrodden section of peoples rights and deprivation of any Human Rights to any section of people.


**DISCLAIMER**
The views, opinions and expressions in various ariticles, NGO and are those of Authors, Human Rights Watch, different news papers and PTI are their respective views and stature of UDBHAVA holds no responsibility.



**ACKNOWLEDGEMENT OF THE SOURCE**
The National Human Rights Commission news letters, State Human Rights Commission Reports, Mahila Commission reports, Articles of the News Papers, PTI reports, Monthly Magazines, Books and International Human Rights Watch, Andhra Pradesh and Telangana State Governments Schemes for Women and Children.

సంపాదకీయం

# చిన్నారుల అక్రమ రవాణాకు కళ్లెం

అప్పుడే జన్మించిన నవజాత శిశువు... ఇంటి బయట అమాయకంగా ఆడుకుంటున్న చిన్నారి... స్కూలుకెళ్లి తిరిగి రాని పాఠశాల విద్యార్థి... ఎవరైతేనేమి కనిపించకపోతే కన్నవారి వేదన ఎలా ఉంటుందో ఊహించడం కష్టం. ఉన్నాడో లేడో... వస్తుందో రాదో... తిన్నారో లేదో... అని ఎదురుచూడటం ఎంతటి భయంకరంగా ఉంటుందో చెప్పనలవి కాదు. పిల్లల అక్రమ రవాణా, ఆసుపత్రుల్లో శిశువుల మిస్సింగ్‌కు సంబంధించి సుప్రీంకోర్టు తాజాగా మార్గదర్శకాలు విడుదల చేయడమే కాదు, ఆసుపత్రుల లైసెన్సు రద్దుచేయాలని ఆదేశించడం శుభపరిణామం. ఆసుపత్రుల్లో జన్మించిన శిశువుల రక్షణ బాధ్యత యాజమాన్యాలదేనని తేల్చిచెప్పింది. పిల్లల అక్రమ రవాణా కేసుల స్థితిగతులపై వివరాలను సమర్పించాలని స్పష్టం చేసింది. ఆరు నెలల్లోగా కేసుల విచారణ పూర్తిచేయాలని, సమయం చాలకపోతే రోజువారీ విచారణ చేపట్టాలని కూడా అన్ని రాష్ట్రాల హైకోర్టులను ఆదేశించింది. అంతేకాదు, అపహరణకు గురైన పిల్లలను గుర్తించడమే కాదు, విద్యాచట్టం కింద వారిని పాఠశాలల్లో చేర్పించాలని సూచించింది. స్మార్ట్‌ఫోన్లతో నెట్‌వర్క్‌గా ఏర్పడిన కిడ్నాపర్లు చైల్డ్ ట్రాఫికింగ్‌లకు ముఠాలుగా ఏర్పడుతున్న విషయాన్ని కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించడం గమనార్హం.

పిల్లలు కనిపించకుండా పోతే తల్లిదండ్రులు పడే వేదన అంతా ఇంతాకాదు. ఊరూ వాడా వెతుకుతూ, బస్సులపై పోస్టర్లు వేస్తూ, కనిపించిన ప్రతివారినీ అడుగుతూ.. పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతూ- ఒక్కముక్కలో చెప్పాలంటే ఒళ్లంతా కళ్లు చేసుకుని ప్రతి క్షణం వారి కోసం ఎదురుచూస్తుంటారు. ఆ తల్లిదండ్రుల బాధ అర్థం చేసుకోవాలంటే మానవీయ కోణం ఉండి తీరాల్సిందే. పిల్లలు చనిపోయినప్పటి కంటే, అపహరణకు గురైనప్పుడే తల్లిదండ్రులు ఎదుర్కొనే బాధ వర్ణనాతీతమని చేసిన సుప్రీంకోర్టు వ్యాఖ్య కనిపించకుండా పోయిన తల్లిదండ్రుల వేదనకు అద్దం పడుతోంది. బిడ్డ చనిపోతే కాలగమనంలో మరచిపోతారు. కానీ పిల్లలు తప్పిపోతే జీవితకాల బాధ. అది మరణాన్ని మించిన వేదన అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం బాధిత తల్లిదండ్రుల గుండె లోతుల్లో గూడుకట్టుకున్న భారాన్ని చెప్పకనే చెబుతోంది.




# దక్షిణాది రాష్ట్రాలే టాప్

- తెలంగాణ పోలీస్ దేశంలోనే నెంబర్ 1
- ఆంధ్రప్రదేశ్ పోలీస్‌కు రెండో స్థానం
- సమర్థవంతమైన పోలీసు, న్యాయవ్యవస్థల్లో తొలి ఐదు స్థానాలు దక్కించుకున్న కర్ణాటక, ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు
- 18 రాష్ట్రాలలో అట్టడుగున బెంగాల్
- 'ఇండియా జస్టిస్ రిపోర్ట్- 2025' వెల్లడి

జస్టిస్ రిపోర్ట్ స్కోర్‌కార్డ్‌లో దక్షిణాది రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయించాయి, పోలీసింగ్, జైళ్లు, న్యాయవ్యవస్థ మరియు న్యాయ సహాయం విభాగాలలో కర్ణాటక అగ్రస్థానంలో నిలిచింది. దేశంలోనే సమర్థవంతమైన పోలీస్ వ్యవస్థగా తెలంగాణ పోలీస్ విభాగం నిలిచింది. అదే సమయంలో సమర్థవంతమైన న్యాయవ్యవస్థలకు సంబంధించి దేశంలోనే

రెండో స్థానం సాధించింది. ఈ రెండింటితోపాటు న్యాయ సహాయం, జైళ్ల నిర్వహణ కూడా కలిపి చూస్తే జాతీయ స్థాయిలో తెలంగాణ మూడో స్థానంలో నిలవడం గమనార్హం. పోలీస్ వ్యవస్థ సామర్థ్యం అంశంలో ఏపీ, కర్ణాటక రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మొత్తంగా పోలీసు, న్యాయవ్యవస్థలు దక్షిణాది రాష్ట్రాల్లోనే మెరుగ్గా ఉన్నాయని వెల్లడైంది. కర్ణాటక అగ్రస్థానంలో నిలవగా తర్వాతి స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు ఉన్నాయి. 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025' నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. పోలీసు, న్యాయవ్యవస్థ, న్యాయ సహాయం, జైళ్ల నిర్వహణ అనే నాలుగు అంశాల పరంగా దేశంలోని 18 పెద్ద, మధ్యస్థాయి రాష్ట్రాల పరిస్థితిని అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందించారు. మొత్తం 10 పాయింట్లకుగాను 6.78 స్కోరుతో కర్ణాటక టాప్‌లో నిలవగా, 3.63 స్కోరుతో పశ్చిమ బెంగాల్ అట్టడుగున నిలిచింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార?ండ్, రాజస్థాన్ రాష్ట్రాలు బెంగాల్ కంటే కాస్త ముందు నిలిచాయి. గతేడాది 11వ స్థానంలో నిలిచిన తెలంగాణ ఈసారి మూడోస్థానానికి.. ఐదో స్థానంలో ఉన్న ఏపీ రెండో స్థానానికి చేరుకోవటం విశేషం.

## లక్ష జనాభాకు 155 మంది పోలీసులు

దేశవ్యాప్తంగా ప్రతి లక్ష జనాభాకు సగటున 197.5 మంది పోలీసులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 155 మంది మాత్రమే ఉన్నారు. లక్ష జనాభాకు కేవలం 81 మంది పోలీసులతో బిహార్ ఆఖరు స్థానంలో ఉంది. అయితే, గతంతో పోలిస్తే 2022-25 మధ్యకాలంలో ఆ రాష్ట్రం పరిస్థితి మెరుగుపడటం గమనార్హం. ఇదే మూడేళ్ల కాలవ్యవధిలో న్యాయవ్యవస్థ పరంగా రాజస్థాన్, కేరళ, మధ్యప్రదేశ్ అత్యంత మెరుగైన ఫలితాలు సాధించాయి. జైళ్ల నిర్వహణలో ఒడిశా, జార్ఖండ్ ఇతర రాష్ట్రాలకన్నా ముందున్నాయి. గత పదేళ్లలో జైళ్లలో ఖైదీల సంఖ్య దాదాపు 50 శాతం పెరిగింది. వీరిలో అత్యధికులు అండర్ ట్రయల్సే (దర్యాప్తు లేదా విచారణ పూర్తికాని కేసులకు సంబంధించిన నిందితులు). పదేళ్లలో జైళ్లలో వీరి వాటా 66 నుంచి 78 శాతానికి పెరిగింది. ప్రజలకు న్యాయ సహాయం పరంగా హరియాణా అన్ని రాష్ట్రాల్లోకి మెరుగైన పనితీరు చూపింది. పోలీసు, న్యాయవ్యవస్థకు బడ్జెట్‌లో కేటాయిస్తున్న నిధుల్లో అత్యధికభాగం సిబ్బంది జీతభత్యాలకే వెళ్తోంది. మౌలిక సదుపాయాల కల్పన, సిబ్బందికి శిక్షణ వంటి కార్యకలాపాలకు అరకొర నిధులు మాత్రమే మిగులుతున్నాయి. దీనివల్ల పోలీసు, న్యాయసేవలపై ప్రతికూల ప్రభావం పడుతోందని నివేదిక పేర్కొంది.

## తెలంగాణలో న్యాయ, పోలీసు వ్యవస్థల తీరు

- తెలంగాణలోని కింది కోర్టులలో 81 మంది ఎస్సీ, 119 మంది ఎస్టీ, 123 ఓబీసీ న్యాయమూర్తులు ఉన్నారని నివేదిక పేర్కొంది. తెలంగాణలో హైకోర్టులో 28.6శాతం, కింది కోర్టుల్లో 20.5 శాతం ఖాళీలు ఉన్నట్టు తెలిపింది.
- తెలంగాణలో 20 ఏళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న కేసులు 17.7 శాతం, 10-20 ఏళ్ల మధ్యవి 32.6శాతం ఉన్నాయని పేర్కొంది.
- తెలంగాణలో పోలీస్ సిబ్బందిలో 8.7 శాతం, జైలు సిబ్బందిలో 6.6 శాతం మహిళలు ఉన్నారని నివేదిక తెలిపింది. మహిళా న్యాయమూర్తులు కింది కోర్టులలో 55.3 శాతం, హైకోర్టులో 33.3 శాతం ఉన్నారని పేర్కొంది.
- తెలంగాణలో పట్టణాలలో 51,974 మందికి, గ్రామాలలో 50,373 మందికి ఒక పోలీస్ స్టేషన్ ఉందని వెల్లడించింది.

# న్యాయాన్ని అందించడంలో టాప్-2లో ఏపీ

మెరుగైన పోలీస్ వ్యవస్థ, జైళ్ల నిర్వహణ, న్యాయాన్ని అందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. కర్ణాటక అగ్రస్థానాన్ని దక్కించుకోగా.. తెలంగాణ, కేరళ, తమిళనాడు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. శాంతిభద్రతలు, మెరుగైన న్యాయవ్యవస్థ, జైళ్ల యాజమాన్యం విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, రాజస్థాన్ చివరి స్థానంలో ఉన్నాయని ఇండియా జస్టిస్ రిపోర్టు వెల్లడించింది. గత సర్వేలో 11వ స్థానాన్ని పొందిన తెలంగాణ, ఈ ఏడాది మూడో స్థానం దక్కించుకుంది. గతంలో ఐదో స్థానంలో ఉన్న ఏపీ ఇప్పుడు రెండో స్థానానికి వచ్చింది. కర్ణాటకకు 1-10 స్కోరులో 6.78 దక్కగా, ఏపీ 6.32, తెలంగాణ 6.15 స్కోర్ దక్కించుకున్నాయి. కింది కోర్టుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ న్యాయమూర్తుల నియామకాల్లో ఏపీ ముందంజలో ఉంది. ఏపీ పోలీస్ సిబ్బందిలో 21.5 శాతం మహిళలు ఉండగా, జైలు సిబ్బందిలో 8.4 శాతం మంది ఉన్నారు. కింది కోర్టుల్లో 50.9 శాతం మహిళా న్యాయాధికారులు ఉండగా, హైకోర్టులో 16.7 శాతం ఉన్నారు. ఏపీ హైకోర్టులో 20 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులు 22.5శాతం, 10-20 ఏళ్ల మధ్య పెండింగ్‌లో ఉన్న కేసులు 26.7 శాతం ఉన్నాయి.

# మూడేళ్లలో ఏపీ పోలీసుల్లో 33% మహిళలు

## మిగతా రాష్ట్రాలు 24 ఏళ్లకు గానీ కోటా చేరుకోలేవు

పోలీసు వ్యవస్థలో మహిళా రిజర్వేషన్ కోటా 33 శాతాన్ని ఇప్పటి వరకు ఏ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం కూడా సాధించలేదని ఇండియా జస్టిస్ నివేదిక-2025 వెల్లడించింది. మరో మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో 33 శాతానికి చేరుకుంటుందని తెలిపింది. అదే సమయంలో మిగతా రాష్ట్రాలు ఈ కోటాను పూర్తిగా అమలు చేయడానికి కనీసం మరో 24 ఏళ్లు అవుతుందని, జార్ఖండ్, త్రిపుర, అండమాన్-నికోబార్‌కు అయితే 200 ఏళ్లు పడుతుందని పేర్కొంది.

### నివేదికలోని వివరాలు

- దేశవ్యాప్తంగా 17 శాతం పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు, 30 శాతం స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్క్‌లు లేవు.
- పోలీసు వ్యవస్థలో లింగ వివక్ష అధికంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్నత స్థాయి పోస్టుల్లో ఉన్న మహిళలు 8 శాతం మాత్రమే. ఏపీలో జాతీయ సగటు కంటే కూడా తక్కువగా ఉంది. ఏపీలో సగటున పోలీసు స్టేషన్‌కు మహిళా ఎస్ఐలు 0.2 శాతం, మహిళా కానిస్టేబుళ్లు 2.5 శాతం మాత్రమే.
- ఏపీలో మొత్తం పోలీసు ఉద్యోగుల్లో మహిళలు 21.5 శాతం, పోలీసు అధికారుల్లో 5.2 శాతం, జైలు ఉద్యోగుల్లో 8.4 శాతం ఉన్నారు.
- న్యాయవ్యవస్థలో పెండింగ్ కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. బిహార్‌లో మూడేళ్ల నుంచి పెండింగ్ కేసులు 71 శాతం ఉన్నాయి.
- ఏపీలో కింది కోర్టుల్లో మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులు 33.5 శాతం. హైకోర్టులో ఐదేళ్ల నుంచి పెండింగ్ కేసులు 50.7 శాతం, 10-20 ఏళ్లలో పెండింగ్‌లో ఉన్నవి 26.7 శాతం, 20 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నవి 22.5 శాతం ఉన్నాయి.
- 10 లక్షల మంది ప్రజలకు 50 మంది జడ్జిలు అవసరం కాగా, ప్రస్తుతం 15 మంది జడ్జిలు మాత్రమే ఉన్నారు. ఏపీలో జడ్జి, ప్రజల నిష్పత్తి10.5 శాతంగా ఉంది. ఇది 50

శాతం ఉండాలి.

- జిల్లా న్యాయస్థానాల్లో మహిళా జడ్జిలు 38 శాతం ఉన్నారు.
- ఏపీ హైకోర్టు జడ్జిల్లో మహిళలు 16.7 శాతం, సబ్‌కోర్టుల్లో 50.9 శాతం ఉన్నారు.
- పోలీసు, న్యాయ వ్యవస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాను అమలు చేసిన ఏకైక రాష్ట్రం కర్ణాటక.
- దేశవ్యాప్తంగా మహిళా పోలీసుల్లో 89 శాతం మంది కానిస్టేబుల్ స్థాయిలోనే ఉన్నారు.

# న్యాయ వ్యవస్థ పనితీరులో ద్వితీయ స్థానంలో తెలంగాణ

దేశంలో న్యాయ వ్యవస్థ పనితీరుపై నిర్వహించిన ఇండియా జస్టిస్ రిపోర్ట్‌లో తెలంగాణా న్యాయ స్థానాలు అరుదైన ఘనత సాధించాయి. నూటికి నూరు శాతం కేసులను పరిష్కరిస్తూ న్యాయవ్యవస్థ పనితీరులో తెలంగాణ ద్వితీయస్థానం సాధించింది. గతంలో 5 స్థానంలో ఉండగా ఆ స్థానాన్ని మెరుగుపర్చుకుని రెండో స్థానానికి ఎగబాకింది. వరుసగా మూడేళ్లుగా 100% కేసు క్లియరెన్స్ రేట్‌ను సాధిస్తోంది. ఈ వివరాలను ఇండియన్ జస్టిస్ రిపోర్ట్ 2025 తాజా నివేదికలో వెల్లడించింది. కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్, విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ, టీఎస్ ప్రయాస్, హౌ ఇండియా లివ్స్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్ లాంటి సంస్థల సహకారంతో టాటా ట్రస్టు ఈ అధ్యయనం నిర్వహించింది. 2019 నుంచి ఈ అధ్యయనం చేస్తోంది. 2025 జనవరి నాటికి దేశంలో పెండింగ్ కేసుల సంఖ్య 5.1 కోట్లు దాటిందని, జడ్జీల నియామకంలో జాప్యం, జనాభాకు సరిపడా న్యాయమూర్తులు లేకపోవడమే దీనికి ప్రధాన కారణాలని అభిప్రాయపడింది. ఆన్ లైన్ విచారణతో.. కరోనాతో వచ్చిన వర్చువల్ విచారణలు, ఆ తర్వాత వచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల కారణంగా కేసుల విచారణ వేగం పుంజుకుంది. ఏటా నమోదవుతున్న కేసుల సంఖ్యను మించి పిటిషన్లు పరిష్కరిస్తూ ముందుకెళ్తోంది. దీంతో హైకోర్టుతో పాటు సబార్డినేట్ కోర్టుల్లో కేసుల పరిష్కార రేటు మెరుగుపడింది. దేశవ్యాప్తంగా 2025లో హైకోర్టుల్లో మొత్తం మంజూరు చేసిన పోస్టుల్లో 33 శాతం జడ్జీల పోస్టులు ఖాళీగా ఉన్నా యి. అత్యధికంగా అలహాబాద్, మధ్య ప్రదేశ్ హైకోర్టులో ఒక్కో న్యాయ మూర్తిపై 15 వేల కేసుల పని భారం ఉంది. తెలంగా ణలో 42 మంది (32 శాశ్వత, 10 అదనపు) జడ్జీలకుగాను 30 మందే ఉన్నారు. సుమారు 30 శాతం (12 పోస్టులు) ఖాళీలున్నాయి.



ఇండియా జస్టిస్ రిపోర్ట్ - 2025 లో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పోలీసు అధికారులను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రిని కలిసి ఇండియా జస్టిస్ రిపోర్ట్‌లోని అంశాలను వివరించారు.

రాష్ట్ర జనాభా సుమారు 3.7 కోట్లుకాగా మంజూరు చేసిన పోస్టుల ప్రకారం ప్రతి 8.8 లక్షల మందికి ఒక హైకోర్టు జడ్జి ఉండాలి. కానీ ప్రస్తుతం ప్రతి 12.3 లక్షల మందికి ఒక జడ్జీ ఉన్నారు. తెలంగాణలో ఒక్కో న్యాయమూర్తిపై 4,000 కేసుల పనిభారం పడుతోంది. దేశవ్యాప్తంగా జిల్లా కోర్టుల్లో 21 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో న్యాయమూర్తిపై 2,200 కేసుల పనిభారం ఉంది. తెలంగాణలో 655 మంది జడ్జీలు ఉండాల్సి ఉండగా 440 మందే ఉన్నారు. సుమారు 215 పోస్టులు ఖాళీలున్నాయి.

## మహిళా జడ్జిల ప్రాతినిధ్యంలో తెలంగాణ నెంబర్ 1

దేశంలోని జిల్లా కోర్టుల్లో మహిళా జడ్జీల ప్రాతినిధ్యం పెరిగింది. 2017లో వారి సంఖ్య 30 శాతం ఉండగా 2025లో 38.3 శాతానికి పెరిగింది. 55.3 శాతంతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంది. హైకోర్టుల్లో మహిళా జడ్జీల ప్రాతినిధ్యం దేశవ్యాప్తంగా 14 శాతం ఉండగా తెలంగాణలో అత్యధికంగా 33.3 శాతంగా ఉంది. దేశంలోని హైకోర్టులన్నింటిలోనూ ఒకే ఒక్క మహిళా ప్రధాన న్యాయమూర్తి మాత్రమే ఉన్నారు.

# జనవరి 2025 నాటికి జడ్జీలు, కేసుల వివరాలు

సుప్రీంకోర్టు జడ్జీలు సహా సిట్టింగ్ జడ్జీల సంఖ్య: 21,285

మొత్తంగా ఉండాల్సిన న్యాయమూర్తుల సంఖ్య: 26,927

మంజూరు చేసిన సంఖ్యతో పోలిస్తే ఖాళీల శాతం: 15

2011 జనాభా లెక్కల ఆధారంగా ప్రతి 10 లక్షల మందికి

రాజ్యసభ సూచించిన జడ్జీల సంఖ్య: 21

1987లో ఏర్పాటైన న్యాయ కమిషన్ ప్రతి 10 లక్షల జనాభాకు

ఉండాలని సూచించిన జడ్జీల సంఖ్య: 50

ప్రస్తుతం దేశంలో ప్రతి 10 లక్షల మందికి ఉన్న జడ్జీల సంఖ్య: 15

అమెరికాలో ప్రతి 10 లక్షల మందికి ఉన్న జడ్జీల సంఖ్య: 150

యూరప్‌లో ఇదే సంఖ్య: 220

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు: 82,000

దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో కేసు క్లియరెన్స్ రేటు (సీసీఆర్): 94%

100% సీసీఆర్ నమోదు చేసుకున్న రాష్ట్రాలు: 7 (తెలంగాణ, జార్ఖండ్, త్రిపుర, మద్రాస్, పంజాబ్, హరియాణా, ఒడిశా, పశ్చిమ బెంగాల్).

# జైళ్ల నిర్వహణలో తమిళనాడు అగ్రస్థానం

బడ్జెట్ కేటాయింపులు పెరగడం, 100% వినియోగంతో జైళ్ల నిర్వహణలో తమిళనాడు అగ్రస్థానాన్ని నిలుపుకుంది. దేశవ్యాప్తంగా జైళ్లలో అత్యల్ప సిబ్బంది ఖాళీలు ఉన్న రాష్ట్రాలలో తమిళనాడు ఒకటి అని, ఒక్కో అధికారికి 22 మంది ఖైదీలతో, అన్ని పెద్ద రాష్ట్రాల కంటే అత్యుత్తమ అధికారి పనిభారం ఇక్కడ ఉందని నివేదిక పేర్కొంది.

దేశంలోని దాదాపు 17% పోలీస్ స్టేషన్లలో ఒక్క సీసీటీవీ కూడా లేదని పేర్కొంది. జైళ్లపై జాతీయ తలసరి ఖర్చు ఒక ఖైదీపై రూ.57 ఉండగా, 2022-23లో ఖైదీపై జాతీయ సగటు అంటే ఏడాదికి రూ.44,110కి పెరిగింది. 2021-22లో రూ.38,028 ఉంది. ఆంధ్రప్రదేశ్ ఖైదీపై అత్యధిక వార్షిక ఖర్చు రూ.2,67,673గా నమోదు చేసింది.



# పోలీసుశాఖలో మహిళా ప్రాతినిధ్యం అంతంతమాత్రమే

పోలీసు శాఖలో మహిళల కోటా అమలు కావడం లేదు. అత్యధికులు కానిస్టేబుల్ స్థాయిలోనే మగ్గిపోతున్నారు. ఇండియా జస్టిస్ రిపోర్ట్ (ఐజెఆర్) 2025 నివేదిక ప్రకారం, డైరెక్టర్ జనరల్ లేదా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వంటి సీనియర్ పదవుల్లో ఉన్నది వెయ్యిలోపే. దాదాపు 90 శాతం మంది మహిళలు కానిస్టేబుల్ స్థాయిలోనే పనిచేస్తున్నారు. పోలీసుల్లోని 2.4 లక్షల మంది మహిళల్లో, 960 మందే ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) ర్యాంకుల్లో ఉండగా, 24,322 మంది డిప్యూటీ సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్ లేదా సబ్-ఇన్‌స్పెక్టర్ వంటి నాన్-ఐపిఎస్ ఆఫీసర్ పదవులను కలిగి ఉన్నారు. "పోలీస్, న్యాయవ్యవస్థ, జైళ్లు, చట్ట సహాయం సామర్థ్యంపై రాష్ట్రాల ర్యాంకింగ్" అనే నివేదిక, చట్ట అమలులో లింగ వైవిధ్యం ఆవశ్యకత గురించి అవగాహన పెరుగుతున్నప్పటికీ, పోలీసు దళంలో మహిళా ప్రాతినిధ్యం కోసం ఏ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం తన లక్ష్యాన్ని చేరుకోలేదని పేర్కొంది. జనవరి 2023 నాటికి, పోలీసులలో మొత్తం మహిళల ప్రాతినిధ్యం సివిల్ పోలీస్, డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వ్ (డిఎఆర్), స్పెషల్ ఆర్మ్డ్ పోలీస్ బెటాలియన్, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ (ఐఆర్‌బి) 12.3 శాతంగా ఉందని, ఇది జనవరి 2022లో 11.7 శాతంగా ఉందని నివేదిక పేర్కొంది. పెద్ద, మధ్య తరహా రాష్ట్రాలలో, బీహార్ 24 శాతంతో, పోలీసులలో మహిళా ప్రాతినిధ్యంలో ముందుంది. 2022లో 21 శాతం నుండి 2024లో 24 శాతానికి బీహార్‌లో వారి ప్రాతినిధ్యం పెరిగింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌తో సహా తొమ్మిది ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తగ్గుదల నమోదైంది. మధ్యప్రదేశ్ 133 మంది మహిళా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌లను కలిగి ఉండి, జాబితాలో అగ్రస్థానంలో ఉంది. చట్ట అమలులో లింగ వైవిధ్యం అవసరం గురించి అవగాహన పెరుగుతున్నప్పటికీ, పోలీసు శాఖలో మహిళా ప్రాతినిధ్యానికి సంబంధించి ఏ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం తన లక్ష్యాన్ని చేరుకోలేదని నివేదిక పేర్కొంది. 33 శాతం

మహిళల కోటా అమలుకు ఇప్పటి పరిస్థితులు కొనసాగితే ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు దాదాపు మూడు సంవత్సరాలు పడుతుందని, జార్ఖండ్, త్రిపుర, అండమాన్ నికోబార్ దీవులకు దాదాపు 200 సంవత్సరాలు పడుతుందని నివేదిక పేర్కొంది.

## హైకోర్టుల్లో మహిళల సంఖ్య 14 శాతమే

దిగువ న్యాయవ్యవస్థలో 38 శాతం మంది మహిళలు ఉండగా, హైకోర్టులలో ఈ సంఖ్య 14 శాతానికి పడిపోయిందని కూడా నివేదిక కనుగొంది. ఫిబ్రవరి-మార్చి 2025 వరకు ఉన్న డేటా ఆధారంగా, న్యాయమూర్తుల విషయానికొస్తే, అన్ని రాష్ట్రాలలో సబార్డినేట్ న్యాయవ్యవస్థలో మహిళల వాటా క్రమంగా పెరిగినప్పటికీ, హైకోర్టులలో ఇలాంటి పెరుగుదల కనిపించలేదని పేర్కొంది. జిల్లా న్యాయవ్యవస్థలో కూడా అదే కాలంలో మహిళల వాటా 38 శాతానికి పెరిగింది. అయితే, జిల్లా న్యాయవ్యవస్థలో షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి), షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి) వాటా వరుసగా 5 శాతం, 14 శాతం వద్ద తక్కువగా ఉంది. అదనంగా, షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి), ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి)లతో పోలిస్తే షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి) కోసం ఉద్యోగ కోటా లక్ష్యాలను తక్కువ రాష్ట్రాలు చేరుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. అధికారుల స్థాయిలో, 5 రాష్ట్రాలు మాత్రమే ఎస్‌సి కోటాను చేరుకున్నాయి. 7 రాష్ట్రాలు ఎస్‌టి కోటాను చేరుకోగా, 9 రాష్ట్రాలు ఒబిసి కోటాను చేరుకున్నాయి. పోలీసు శాఖలో ఎస్‌సిలు 17 శాతం, ఎస్‌టిలు 12 శాతం ఉన్నారు, ఇది దామాషా ప్రాతినిధ్యంలో లేదు.

## 10 లక్షల మందికి 15 మంది న్యాయమూర్తులు

భారతదేశంలో పది లక్షల మందికి 15 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారని, ఇది లా కమిషన్ 1987లో సిఫార్సు చేసిన 50 మంది కంటే చాలా తక్కువ అని కూడా నివేదిక పేర్కొంది. హైకోర్టులు 33 శాతం ఖాళీలతో, జిల్లా కోర్టులు 21 శాతం ఖాళీలతో పనిచేస్తున్నాయి. దీని ఫలితంగా అలహాబాద్, మధ్యప్రదేశ్ వంటి హైకోర్టులలో ప్రతి న్యాయమూర్తికి 15,000 కేసుల వరకు భారీ పనిభారం పడుతోంది. జిల్లా కోర్టు న్యాయమూర్తులు సగటున ఒక్కొక్కరు 2,200 కేసులను నిర్వహిస్తున్నారు. జాతీయ సగటు ఆక్యుపెన్సీ రేటు 131 శాతంగా ఉంది. “2030 నాటికి జైలు జనాభా అందుబాటులో ఉన్న స్థలానికి భిన్నంగా ఉండే అవకాశం ఉంది” అని కూడా నివేదిక పేర్కొంది. భారతదేశ జైలు జనాభా 2030 నాటికి 6.8 లక్షలకు చేరుకుంటుందని అంచనా. ఉత్తరప్రదేశ్‌లో కొన్ని చెత్త కేసులు ఉన్నాయి. అక్కడి ప్రతి మూడు జైళ్లలో ఒకటి దాని సామర్థ్యంలో 250 శాతానికి పైగా ఉందని నివేదిక పేర్కొంది. జైళ్లలో వైద్య సిబ్బంది చాలా తక్కువగా ఉన్నారు. ఖైదీ-వైద్యుల నిష్పత్తి సిఫార్సు చేయబడిన 300:1కి

భిన్నంగా 775:1 వద్ద ఉంది. హర్యానా, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌తో సహా అనేక పెద్ద రాష్ట్రాల్లో, ఈ నిష్పత్తి 1,000:1ని మించిపోయింది. చిన్న రాష్ట్రాలలో, సిక్కిం అగ్రస్థానంలో నిలిచింది, తరువాత హిమాచల్ ప్రదేశ్ మరియు అరుణాచల్ ప్రదేశ్ ఉన్నాయి. 2022 మరియు 2025 మధ్య పెద్ద, మధ్య తరహా రాష్ట్రాలలో బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా అత్యంత మెరుగుదలను చూపించాయి. ఈ నివేదిక 25 రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ల పనితీరును కూడా అంచనా వేసింది వ్యవస్థాగత సంస్కరణలకు ప్రాధాన్యత ఇవ్వకపోతే, న్యాయ వ్యవస్థ బలహీనులు మరియు అణగారిన వారిపై అసమానంగా భారం పడుతూనే ఉంటుందని ఐజెఆర్ నివేదిక హెచ్చరించింది. న్యాయం అందించడంలో 18 పెద్ద, మధ్య తరహా రాష్ట్రాలలో కర్ణాటకను అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రంగా ఆ నివేదిక పేర్కొంది.

# 'పింక్ ఆటో'లు పురుషులు నడిపితే స్వాధీనం

## చెన్నై జిల్లా కలెక్టర్ హెచ్చరిక



పురుషులు 'పింక్' ఆటోలు నడిపితే స్వాధీనం చేసుకుంటామని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... రాజధాని నగరంలో మహిళలు, పిల్లల భద్రత దృష్ట్యా జీపీఎస్, క్యూ ఆర్ కోడ్ తదితర వసతులతో కూడిన 'పింక్' ఆటోలను ప్రభుత్వం పరిచయం చేసిందన్నారు. ఆటో కొనుగోలులో రూ.లక్ష సబ్సిడీ, బ్యాంకుల నుండి రుణం మంజూరుతో మార్చి 8వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ పథకం ప్రారంభించారు. తమిళనాడు మోటారు వాహన చట్టం ప్రకారం, పింక్ ఆటోలు మహిళలే నడపాల్సి ఉందన్నారు. కానీ, నగరంలో అధిక శాతం పింక్ ఆటోలు పురుషులు నడుపుతున్నారని ఫిర్యాదులందాయని తెలిపారు. ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, పింక్ ఆటోలు పురుషులు నడిపితే, వాటిని స్వాధీనం చేసుకుంటారని కలెక్టర్ తెలిపారు.

# అభివృద్ధి బాటలో భారత్

## పదేళ్లలో 17 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు..

## పట్టణ, గ్రామాల మధ్య తగ్గుతున్న అంతరం..

## వెల్లడించిన వరల్డ్ బ్యాంక్

పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనలో భారత్ దూసుకెళ్తోంది. దశాబ్దకాలంగా దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిపోయింది. గత పదేళ్లలో 17.10 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2011-12లో దేశ జనాభాలో 16.2 శాతం ప్రజలు దుర్భర పేదరికం (రోజుకు 2.15 డాలర్ల కంటే తక్కువ ఆదాయం)లో మగ్గగా, 2022-23 నాటికి ఆ సంఖ్య 2.3 శాతానికి తగ్గినట్టు ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. దుర్భర పేదరికంతో బాధపడుతున్నవారు పదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో 18.4 శాతం నుంచి 2.8 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరం 7.7 నుంచి 1.7 శాతానికి తగ్గింది. పేదలు క్రమేణా దిగువ-మధ్య-ఆదాయ కేటగిరీలోకి మారుతున్నారు. అలాగే దిగువ-మధ్య-ఆదాయ కేటగిరిలో ఉన్నవారు మధ్య తరగతి ఆదాయ కేటగిరిలోకి వెళు తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం 69 శాతం నుంచి 32.5 శాతానికి, పట్టణాల్లో 43.5 శాతం నుంచి 17.2 శాతానికి తగ్గింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం 25 నుంచి 15 శాతానికి తగ్గింది. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనలో భారత్ పురోగతి సాధిస్తోందని ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది. 2021-22 నుంచి యువత (శ్రామిక-వయసు జనాభా) కంటే వేగంగా ఉపాధి పెరుగుతోందని వెల్లడించింది. ముఖ్యంగా మహిళలు, గ్రామీణుల్లో స్వయం ఉపాధి పెరుగుతోందని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పట్టణ నిరుద్యోగం 6.6 శాతానికి తగ్గిందని, 2017-18 నుంచి ఇదే అతి తక్కువ అని వెల్లడించింది. ఉపాధి కోసం గ్రామీణ పురుషులు పెద్ద సంఖ్యలో పట్టణాల బాట పడుతున్నారని తెలిపింది. వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల ఉపాధి మెరుగుపడినట్టు పేర్కొంది. దేశంలో మహిళల ఉపాధి రేటు 31 శాతానికి చేరినట్టు వెల్లడించింది.

# వేగం పుంజుకున్న మహిళా సాధికారత

## కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో వెల్లడి

పలు రంగాల్లో మహిళా సాధికారత వేగం పుంజుకుందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. 'విమెన్ అండ్ మెన్ ఇన్ 2024' పేరిట విడుదల చేసిన నివేదికలో పలు అంశాలను పరిశీలిస్తే.. జెండర్ పారిటీ ఇండెక్స్ (జీపీఐ)లో బాలబాలికల వ్యత్యాసం అప్పర్ ప్రైమరీ ఎలిమెంటరీల్లో కనిపించినా.. ప్రాథమిక, హయ్యర్ సెకండరీల్లో స్థిరంగా ఉన్నట్లు గడిచిన నాలుగేళ్ల డాటా చెబుతోంది దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు ఖాతాల్లో మహిళల వాటా 39.2%. మొత్తం డిపాజిట్లలో వారి వాటా 39.7 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల డిపాజిట్ల వాటా 42.2 శాతంగా ఉండడం గమనార్హం..! స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన డీమాట్ ఖాతాల్లోనూ మహిళలు పురోభివృద్ధి సాధిస్తున్నారు. 2021-24 మధ్యకాలంలో దేశంలోని డీమాట్ ఖాతాల సంఖ్య 3.32 కోట్ల నుంచి 14.3 కోట్లకు పెరిగింది. ఇందులో మహిళల భాగస్వామ్యం 2021లో 66 లక్షలుగా ఉండగా.. 2024 కల్లా.. 2.77 కోట్లకు పెరిగింది. మహిళలు నిర్వహిస్తున్న పరిశ్రమలు కూడా పెరిగాయని తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఉత్పాదకరంగంలో వారి వాటా 58.4 శాతంగా ఉంది. వాణిజ్యంలో 13.7%, ఇతర సేవల్లో 14.2% వాటాను కలిగి ఉన్నారు.



# కర్ణాటక మాజీ డీజీపీ దారుణ హత్య

## కళ్లలో కారం చల్లి, కత్తులతో పొడిచి చంపిన భార్య

కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ హత్య కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓంప్రకాశ్‌ను ఆయన భార్య పల్లవీనే హత్య చేసినట్లు తేలగా ఈ క్రమంలో ఆమె అత్యంత పాశవికంగా వ్యవహరించినట్లు వెల్లడైంది. కత్తితో పొడిచే ముందు కళ్లల్లో కారం చల్లిన పల్లవి, తర్వాత ఆయన్ను బంధించి, విచక్షణారహితంగా పొడిచినట్లు గుర్తించారు. అయితే పల్లవి మానసిక స్థితి సరిగా లేదనే వాదన కూడా వినిపిస్తోంది. ఒకరోజు ఓం ప్రకాశ్, ఆయన భార్య పల్లవి గొడవపడ్డారు. అది తీవ్రరూపం దాల్చగా పల్లవి ఆయనపై కారప్పొడి చల్లిందని పోలీసు వర్గాలు తెలిపాయి. కళ్లు మండుతుండడం వల్ల తీవ్రంగా బాధపడుతున్న ఆయన్ను కట్టేసిన పల్లవి, తర్వాత పలుమార్లు పొడిచి చంపిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో ఆమె ఒక గ్లాస్ బాటిల్‌ను ఉపయోగించిందని చెప్పారు. తర్వాత నిందితురాలు మరో పోలీసు అధికారి భార్యతో వీడియో కాల్‌లో మాట్లాడారన్న పోలీసులు, తన భర్తను తానే చంపేసినట్లు చెప్పారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే హత్య ఘటన పోలీసుల దృష్టికి చేరింది. దీంతో పల్లవి, ఆమె కుమార్తె క్రితిని అదుపులోకి తీసుకున్నారు. ఓం ప్రకాశ్ తన బంధువుకు ఒక ఆస్తిని బదిలీ చేశారని, ఆ విషయంలో జరిగిన గొడవే ఈ పరిస్థితికి దారితీసిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ హత్యలో మాజీ డీజీపీ ఓంప్రకాశ్ కుమార్తె క్రితి పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఓంప్రకాశ్ భార్య పల్లవి గత 12 ఏళ్లుగా స్కిజోఫీనియాతో బాధపడుతోందని, చికిత్స కూడా పొందుతోందని ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు తన భర్త నుంచి ప్రమాదం ఉందని తరచూ భయపడేదని, ఊహాజనితమైన ఆలోచనలతో ఆందోళనకు గురయ్యేదని తెలిపారు. ఆస్తి గొడవకు సంబంధించి గతంలో ఓంప్రకాశ్‌పై పల్లవి సమీప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. మొదట పోలీసులు ఫిర్యాదును తీసుకోకపోతే స్టేషన్ ముందు ధర్నా కూడా చేసినట్లు తెలిసింది. బిహార్‌లోని చంపారన్‌కు చెందిన ఓంప్రకాశ్, 1981 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 2015 మార్చి 1న కర్ణాటక డీజీపీగా బాధ్యతలు చేపట్టి, 2017లో పదవీ విరమణ పొందారు. అనంతరం బెంగళూరులో నివసిస్తున్నారు. ఓంప్రకాశ్ హత్య సమాచారం తెలుసుకొని ఇంటికి వెళ్లిన పోలీసులు, ఆయన రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గుర్తించారు. చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు

వైద్యులు ధ్రువీకరించారు.

# భార్య వేధింపులతో భర్త బలవన్మరణం

భార్య వేధింపులు భరించలేక బెంగళూరుకు చెందిన అతుల్ సుభాశ్ బలవన్మరణ తరహా ఘటన ఉత్తరప్రదేశ్‌లో మరోకటి జరిగింది. తన భార్య, ఆమె కుటుంబం తనను మానసికంగా చిత్రహింసలకు గురి చేస్తోందని ఆరోపిస్తూ ఒక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మోహిత్ యాదవ్ అనే వ్యక్తి ప్రియా అనే యువతి ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలోనే పెద్దలను ఒప్పించి రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. మోహిత్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఫీల్డ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, కొన్ని రోజులుగా దంపతుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. భార్య తరపు కుటుంబం తనపై బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఒక వీడియో తీసుకున్నాడు. అనంతరం ఒక హోటల్‌లో బలవన్మరణం చేసుకుని ప్రాణాలు కోల్పోయాడు. “రెండు నెలల క్రితం నా భార్య ఒక ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం సాధించింది. ఆ సమయంలో గర్భవతిగా ఉన్న నా భార్యకు మా అత్తయ్య అబార్షన్ చేయించింది. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను కూడా బలవంతంగా మా అత్తయ్యే దగ్గర పెట్టుకుంది. ఇంకా మా పెళ్లి సమయంలో కూడా వారి నుంచి నేను ఒక రూపాయి కట్నం తీసుకోలేదు. తిరిగి నాపైనే తప్పుడు కేసులు పెట్టారు. మా ఆస్తులు తన పేరుపై బదిలీ చేయాలని నా భార్య కూడా తరచూ గొడవకు దిగేది. ఈ విషయంపై వారి కుటుంబ సభ్యులు నన్ను మానసికంగా చిత్రహింసలు పెట్టారు. వారు చెప్పినట్లు చేయకపోతే నా కుటుంబంపై కూడా కేసు పెడతామని బెదిరించారు. ఈ విషయంలో మా మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. వారి వేధింపులు తట్టుకోలేక పోతున్నా, అమ్మనాన్న నన్ను క్షమించండి. నేను చనిపోయాక కూడా న్యాయం జరగకపోతే, నా బుడిదను కాలువలో కలిపేయండి” అంటూ మోహిత్ ఆవేదన వ్యక్తం చేశాడు. రికార్డ్ చేసిన వీడియోను సమీప బంధువులకు పంపించి బలవన్మరణం చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భార్య వేధింపులు తట్టుకోలేక విడాకుల కోసం 15ఏళ్ల పాటు పోరాటం

భార్య వేధింపులు తట్టుకోలేక ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి విడాకుల కోసం సుదీర్ఘ

పోరాటం చేశాడు. దాదాపు 15ఏళ్ల పాటు కోర్టుల చుట్టూ తిరిగి చివరకు విడాకులు సాధించాడు. అనేక దాడులతో పాటు మానసిక ప్రశాంతతకు దూరమయ్యాడు. ఇంకా అతడిపై దాదాపు 45 ఎఫ్ఐఆర్లు సైతం నమోదయ్యాయి. చివరకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థలో ఉద్యోగం సైతం మానేశాడు. ఒడిశాకు చెందిన ఓ వ్యక్తికి 2003లో ఓ మహిళతో వివాహం జరిగింది. పెళ్లి అయిన కొద్ది రోజుల నుంచే వీరిద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. LIC పాలసీలో నామినీగా తననే పెట్టాలని, భువనేశ్వర్లో ఉన్న ఇల్లును తన పేరిట రాయాలని, తల్లిదండ్రులతో సంబంధాలను తెంచుకుని ఇంటి హక్కులు తనకే ఉండాలంటూ భార్య వేధిస్తోంది. ఈ క్రమంలోనే వృత్తి రీత్యా హరిపుర్తో పాటు భువనేశ్వర్, బెంగళూరు, అమెరికా, బ్యాంకాక్, జపాన్ ప్రాంతాలకు వెళ్లినా భార్య వేధింపులు ఆగలేదు. మాటమాట పెరిగి అనేక సార్లు భర్తపై దాడి చేసింది. డల్లాస్లో ఉండే సమయంలో ఓసారి వాగ్వాదం పెరిగి మ్యూజిక్ సిస్టమ్ స్పీకర్తో భర్త తలపై కొట్టింది. దీంతో ఎమెర్జెన్సీ వార్డులో చేరి కొన్ని రోజుల పాటు చికిత్స తీసుకున్నాడు. ఆ తర్వాత తిరిగి ఒడిశాకు వచ్చాక.. ఇంటికి గుండాలను పంపి బెదిరించింది. అత్తమామలను ఇంటి నుంచి ఖాళీ చేసి వెళ్లాలని హెచ్చరించింది. ఇంటికి తాళం వేసి వారి నడి రోడ్డుపైనే ఉంచగా, పోలీసులు జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగించారు. ఇక భార్య వేధింపులు తాళలేక చివరకు 2009లో భర్త విడాకుల కోసం కటక్ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. కానీ, ఆమె దీనిని వ్యతిరేకిస్తూ భర్తతో కలిసి ఉంటానని కోర్టుకు చెప్పింది. ఆ తర్వాత భర్తపైనే పోలీస్? స్టేషన్?లో సుమారు 45 సార్లు ఫిర్యాదు చేసింది. అయితే, 2009లో దాఖలైన పిటిషన్పై విచారణ చేపట్టిన కోర్టు, 2023 ఆగస్టు 7 విడాకులు మంజూరు చేసింది. అయితే, భార్యకు రూ.63 లక్షల భరణం చెల్లించాలని ఆదేశించింది. కానీ కటక్ ఫ్యామిలీ కోర్టు తీర్పును అంగీకరించకుండా ఒడిశా హైకోర్టులో అప్పీలు చేసింది భార్య.

అయితే, విచారణ జరుగుతున్న సమయంలోనూ భర్తపై వేధింపులు ఆపలేదు భార్య. దీంతో చివరకు చేస్తున్న ఉద్యోగానికి సైతం రాజీనామా చేశాడు. తన భార్య వేధింపులతో పని పట్ల దృష్టి సారించలేకపోతున్నానంటూ లేఖలో పేర్కొన్నాడు. ఇటీవలే విచారణ చేపట్టిన ఒడిశా హైకోర్టు, కటక్ ఫ్యామిలీ కోర్టు తీర్పును సమర్థించింది. ఆమె చర్యలు దారుణంగా ఉన్నాయని, ఇలాంటి విషపూరిత వివాహం బంధంలో ఉండాలంటూ చట్టం బలవంతం చేయకూడదని వ్యాఖ్యానించింది. హిందూ వివాహ చట్టం ప్రకారం భర్తకు కూడా మానసిక శాంతి ఉండాలని తెలిపింది. చివరకు 2025 మార్చి 19న విడాకులు మంజూరు చేస్తూ తీర్పును ఇచ్చింది. రూ. 63లక్షల భరణం ఇవ్వాలంటూ కటక్ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పుతో ఏకభవించింది. ఇలా అనేక సంవత్సరాల పాటు పోరాడి విడాకులను పొందాడు.

# సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్



సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్ నియామకం కానున్నారు. జస్టిస్ బిఆర్ గవాయ్‌ను తదుపరి సీజేఐగా నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రతిపాదన చేశారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం మే 13వ తేదీన ముగియనుంది. సంప్రదాయం ప్రకారం తదుపరి సీజేఐ పేరును ప్రతిపాదించాలని జస్టిస్ సంజీవ్ ఖన్నాను న్యాయశాఖ కోరగా, ఆయన జస్టిస్ గవాయ్ పేరును ప్రతిపాదించారు. ఫలితంగా మే 14వ తేదీన జస్టిస్ గవాయ్ భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన 6 నెలల పాటు ఆ బాధ్యత నిర్వహించి నవంబర్‌లో పదవీ విరమణ చేస్తారు. భారత ప్రధాన న్యాయమూర్తి బాధ్యతను నిర్వహించనున్న రెండో దళిత కుటుంబానికి చెందిన వ్యక్తిగా జస్టిస్ గవాయ్ నిలవనున్నారు. ఆయన కన్నా ముందు 2007లో దళిత కుటుంబానికి చెందిన జస్టిస్ బాలకృష్ణన్ సీజేఐ పదవిని చేపట్టారు.

# లా కమిషన్ చీఫ్‌గా జస్టిస్ దినేష్ మహేశ్వరి



సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరి 23వ లా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని న్యాయ శాఖ ఎక్స్ ద్వారా తెలిపింది. ఆయన నియామకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదించారని పేర్కొంది. పూర్తికాల సభ్యులుగా న్యాయవాది హితేష్ జైన్, ప్రొఫెసర్ డి.పి.వర్మ నియమితులయ్యారు. ప్రొఫెసర్ వర్మ గత లా కమిషన్‌లోనూ సభ్యుడిగా పనిచేశారు. వారు బాధ్యతలు స్వీకరించారని న్యాయ శాఖ తెలిపింది. ఈ ముగ్గురి పేర్లను న్యాయ వ్యవహారాల విభాగం ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

# తెలంగాణ మానవహక్కుల సంఘం చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్ బాధ్యతల స్వీకరణ



తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కమిషన్ సభ్యులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి కిశోర్, శివాది ప్రవీణ కూడా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత షమీమ్ అక్తర్ మీడియాతో మాట్లాడుతూ.. తాము బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే.. 300 పాత కేసులు పరిశీలించామన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న కేసులతోపాటు ఇక ముందు నమోదయ్యే కేసులను పరిష్కరించి రాజ్యాంగబద్ధంగా ప్రజలకు న్యాయం చేయడానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్‌గా జస్టిస్ గుండా చంద్రయ్య పదవీ విరమణచేసిన తర్వాత ఆరేళ్లుగా ఈ పదవి ఖాళీగా ఉంది. అన్ని రాష్ట్రాలు తప్పనిసరిగా మానవహక్కుల సంఘం చైర్మన్, సభ్యులను నియమించాలని ఇటీవల సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియామకాలు చేపట్టింది.

# తెలంగాణ జైళ్లల్లో తమిళనాడు విధానం

తెలంగాణ జైళ్లల్లో తమిళనాడు తరహా విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నకిలీ బెయిల్ పత్రాలతో ఖైదీ విడుదల.. రిమాండ్ ఖైదీతో రీల్స్.. ఇలా ఇటీవలి కాలంలో జైళ్లలో వెలుగు చూసిన ఘటనల నేపథ్యంలో భద్రత చర్యల్లో భాగంగా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇకపై ఇలాంటి సంఘటనలకు అవకాశం లేకుండా.. భద్రతను కట్టుదిట్టం చేయడంపై ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో చర్చించారు. తమిళనాడు తరహాలో.. జైళ్లశాఖ సిబ్బందికి బాడీవోర్న్ కెమెరాలను సమకూర్చాలని తీర్మానించారు. రాష్ట్రంలోని కారాగారాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా.. భద్రత లోపాలు అడపాదడపా బయటపడుతున్నాయి. ఖైదీలతో అంటకాగే సిబ్బందిపై నిఘా అవసరమని భావించిన అధికారులు.. బాడీవోర్న్ కెమెరాలొక్కటే పరిష్కారమని భావిస్తున్నారు. ఈ కెమెరాలు వైర్‌లెస్ వ్యవస్థలకు అనుసంధానమై ఉంటాయి. దీని వల్ల కంట్రోల్‌రూమ్‌లో, ఉన్నతాధికారులు తమ కార్యాలయాల్లో ఎప్పటికప్పుడు లైవ్‌గా పరిస్థితిని పర్యవేక్షించే వెసులుబాటు కలుగుతుంది.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి

## 33 మందిలో 21 మంది వివరాలు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో
## రూ.120 కోట్లతో శ్రీమంతుడు జస్టిస్ విశ్వనాథన్
## సీజేఐ ఖన్నాకు రెండు ఇళ్లు, రూ.2.77 కోట్ల నగదు, స్విఫ్ట్ కారు
## సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల నియామక వివరాలూ వెల్లడి

భారత సర్వోన్నత న్యాయస్థానం పారదర్శకతలో భాగంగా న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను తన వెబ్‌సైట్లో పెట్టింది. ఇప్పటివరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 33 మందిలో 21 మంది తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందజేశారు. వారిలో జస్టిస్ కేవీ విశ్వనాథన్‌కు అత్యధికంగా రూ.120 కోట్ల ఆస్తి ఢిల్లీ, కోయంబత్తూర్‌లలో ఉన్నట్లు వెల్లడైంది. ఆదాయ పన్ను లెక్కల్లో ఆయన రూ.91.47 కోట్ల ఆస్తిని చూపారు. దిగిపోతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆస్తుల విలువ కాకుండా వివరాలను ఇచ్చారు. అందులో 55.75 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, దక్షిణ ఢిల్లీలో మూడు బెడ్రూమ్‌ల ఇల్లు, కామన్‌వెల్త్ గేమ్స్ విలేజ్‌లో నాలుగు బెడ్రూముల ఇల్లు ఉన్నాయి. కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కు బ్యాంకు ఖాతాల్లో 19.63 లక్షలు ఉన్నాయి. మహారాష్ట్రలోని అమరావతిలో వారసత్వంగా వచ్చిన ఇల్లు, ముంబైలోని బాంద్రాలో, ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు, అమరావతి, నాగపూర్‌లలో వ్యవసాయ భూమి ఉన్నాయి. ఏప్రిల్ 1న జరిగిన న్యాయమూర్తుల సమావేశంలో న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. వెబ్‌సైట్లో పెట్టిన సమాచారం ప్రకారం చూస్తే వారంలో దిగిపోతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నాకు గురుగ్రామ్‌లో 4 బెడ్రూముల ఇంట్లో 56 శాతం వాటా, హిమాచల్ ప్రదేశ్‌లోని డల్‌హౌసీలో ఇంటి వాటా ఉన్నాయి. పీపీఎఫలో కోటి, జీపీఎఫలో కోటీ 77 లక్షలు, 25 తులాల బంగారం, రెండు కిలోల వెండి, 2015లో కొన్న మారుతి స్విఫ్ట్ కారు ఉన్నాయి.

జస్టిస్ గవాయ్‌కు రూ.5 లక్షల బంగారం, ఆయన భార్యకు 29 లక్షల బంగారం ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో ప్రధాన న్యాయమూర్తి కాబోతున్న జస్టిస్ సూర్యకాంత్‌కు చండీగఢ్‌లో ఇల్లు, పంచకులలో 13 ఎకరాల వ్యవసాయ భూమి, గురుగావ్‌లో 300 గజాల ప్లాట్ ఉన్నాయి. రూ.4.11 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. లాయర్ నుంచి సుప్రీంకోర్టు జడ్జిగా ఎదిగిన జస్టిస్ విశ్వనాథన్ అత్యధిక ఆస్తులను చూపించారు. న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను అప్‌లోడ్ చేయడమే కాకుండా గత రెండున్నరేళ్లుగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకం జరిగిన విధానాన్ని కూడా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పెట్టారు. గత రెండున్నరేళ్లలో నియామకానికి పరిశీలించిన పేర్లలో కేవలం 6 శాతం మంది మాత్రమే న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు. మొత్తం 221 మంది పేర్లను జడ్జిలుగా సిఫార్సు చేస్తే అందులో 14 మంది న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారని తేలింది. వారిలో ఒకరి (పంజాబ్ హైకోర్టుకు చెందిన న్యాయవాది రోహిత్ కుమార్) పేరును మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇంకా ఆమోదించాల్సి ఉంది. రెండున్నరేళ్లలో 221 పేర్లను సుప్రీంకోర్టు సిఫార్సు చేయగా, 29 పేర్లు ఇంకా కేంద్రం పరిశీలనలో ఉన్నాయి. జస్టిస్ చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉండగా హైకోర్టు కొలీజియాల నుంచి 303 ప్రతిపాదనలు వచ్చాయి. అందులో 170 మంది(56 శాతం) పేర్లను జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదించింది. అందులో ఏడు శాతం మంది(12) న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రధాన న్యాయమూర్తి అయ్యాక రాష్ట్రాల కొలీజియాల నుంచి 103 ప్రతిపాదనలు రాగా వాటిలో 51 మందిని ఆయన ఆమోదించారు. అందులో ఇద్దరు న్యాయమూర్తుల కుటుంబాలకు చెందిన వారు. ఛత్తీసగఢ్ హైకోర్టు జడ్జిగా ఎంపికైన జస్టిస్ బిబూ దత్త గురు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు బావ/బావమరిది. జస్టిస్ దత్తగురు ఎంపిక అయినపుడు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కొలీజియంలో లేరు.

## జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు.. సీజేఐకి త్రిసభ్య కమిటీ నివేదిక

జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై దర్యాప్తు జరిపిన త్రిసభ్య కమిటీ.. తన నివేదికను సీజేఐకి సమర్పించింది. మార్చి 14న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి (ఆ సమయంలో) జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరగ్గా.. మంటలు ఆర్పేందుకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సగం కాలిన నోట్ల కట్టలు దొరికాయన్న వార్తలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా మార్చి 22న ముగ్గురు న్యాయమూర్తులతో కమిటీ ఏర్పాటు చేశారు.

# అలహాబాద్ హైకోర్టులో ఏం జరుగుతోంది?

## మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం



దేశంలోనే అత్యంత పురాతనమైన, అతిపెద్ద రాజ్యాంగ న్యాయస్థానాల్లో ఒకటైన అలహాబాద్ హైకోర్టు వెలువరిస్తున్న ఉత్తర్వుల్లో ఇటీవల పదేపదే చేస్తున్న కొన్ని న్యాయ వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలను చూస్తుంటే మహిళల పట్ల అనుచిత దృక్పథంతో వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవు తోందని వ్యాఖ్యానించింది. మైనర్ బాలిక శరీరాన్ని అసభ్యంగా తాకడం, ఆమె దుస్తులను ఊడదీయ డానికి ప్రయత్నించడం వంటి చర్యలతో సదరు నిందితుడు అత్యాచారానికి యత్నించాడని అనడం సరికాదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా వ్యాఖ్యానించారు. అది జరిగిన కొద్ది రోజులకే, అదే హైకోర్టుకు చెందిన మరో న్యాయమూర్తి జస్టిస్ సంజరు కుమార్‌సింగ్ అత్యాచార నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తూ, బాధితురాలు సమస్యను కోరి తెచ్చుకుందని, ఆమెకు కూడా ఇందులో బాధ్యత వుందని వ్యాఖ్యానించారు.

"ఈ హైకోర్టులో ఏం జరుగుతోంది? ఇదే హైకోర్టుకు చెందిన మరో న్యాయమూర్తి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. అసలు ఎందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు?.. సున్నితమైన ఇలాంటి కేసుల్లో ఎవరైనా చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి వుంటుంది." అని జస్టిస్ బిఆర్ గవారు వ్యాఖ్యానించారు. మార్చి 17న జస్టిస్ మిశ్రా జారీ చేసిన ఉత్తర్వులను కోర్టు సుమోటో కేసుగా పరిగణనలోకి తీసుకుని, విచారణ జరిపింది. "న్యాయం జరగడమే కాదు, అది జరిగేలా చూడాలి. ఇలాంటి వ్యాఖ్యలు చూసి సామాన్య మానవుడు ఏం ఆలోచిస్తాడు?" అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రశ్నించారు. సుమోటో కేసులో

ఆయన వాదనలు వినిపించారు. సంబంధిత పక్షాల మధ్య వాదనలు అసంపూర్తిగా వున్నాయని పేర్కొంటూ అనంతరం బెంచ్ ఈ కేసు విచారణను వాయిదా వేసింది. జస్టిస్ మిశ్రా మాట్లాడుతూ, మైనరు బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు, ఆమె పైజామాను ఊడదీసినందుకు లైంగిక వేధింపుల్లో తక్కువ నేరం కింద ఆ ఇద్దరు నిందితులపై అభియోగం మోపవచ్చని మార్చి 17న అన్నారు. బాధితురాలిని తమ బైక్‌పై ఎక్కించుకున్న ఆ ఇద్దరు యువకులు ఆమె వక్షోజాలను అదుముతూ, పైజామాను కిందకు లాగుతూ కల్వర్టు కిందకు లాక్కుని వెళ్లేందుకు ప్రయత్నించారని ప్రాసిక్యూషన్ తన వాదన వినిపించింది. ఈలోగా దారినపోయే వారు చూడడంతో వారు అక్కడ నుండి పారిపోయారు. "ఆ చర్యను పరిశీలించినట్లైతే, నిందితులు చాలా స్పష్టమైన ఉద్దేశంతోనే పాల్పడినట్లు స్పష్టమవుతోంది. అత్యాచార యత్నాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలోనే వారు వున్నట్లు తెలుస్తోంది." అని బాధితురాలి తల్లి, ఎన్‌జిఓ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ కలిసి దాఖలు చేసిన పిటిషన్ పేర్కొంది. పైగా నిందితుడు తనకు తానుగా ఆ నేరాన్ని చేయకుండా ఆగలేదని, దారినపోయేవారు చూసి జోక్యం చేసుకోవడంతో ఆ ప్రదేశం నుండి వారు పారిపోయారని తెలుస్తోందని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది హెచ్‌ఎస్ ఫూల్కా వాదించారు. మార్చి 17న అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు మార్చి చివరిలో స్టే విధించింది. అత్యాచార ఆరోపణలపై విచారణా కోర్టు నుండి తనకు సమన్లు రావడంపై నిందితుడు వేసిన రివిజన్ పిటిషన్‌పై హైకోర్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులు పూర్తి అనుచితంగా వున్నాయని, అమానవీయమైనవని, చట్ట నిబంధనలకు పూర్తి విరుద్ధంగా వున్నాయని సుప్రీంకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. పైగా మైనర్ బాలిక అనుభవించిన బాధ, ఇబ్బంది వీటన్నింటినీ పేర్కొంటున్న ఉత్తర్వుల్లోని కొన్ని పేరాగ్రాఫ్‌లను ఎత్తిచూపుతూ అయినా అత్యాచార యత్నం జరగలేదని నిర్ధారించడం చూస్తుంటే సున్నితత్వం పూర్తిగా కొరవడిందని తెలుస్తోందని జస్టిస్ గవారు తీవ్రంగా వ్యాఖ్యానించారు.

# కట్నం కేసులపై పార్లమెంటే చట్టం చేయాలి

## ఈ అంశంలో జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు

వరకట్న వేధింపులు, మెయింటెనెన్స్ చెల్లింపునకు సంబంధించిన చట్టాలు దుర్వినియోగం కాకుండా.. మహిళలు, పురుషులకు సమానంగా వర్తించేలా మార్గదర్శకాలు ఇవ్వాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను సుప్రీంకోర్టు

కొట్టివేసింది. కోర్టులు చట్టాలు చేయలేవని, ఇది పార్లమెంటు బాధ్యత అని పేర్కొంది. జనశ్రుతి అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. చట్టంలో దుర్వినియోగం కాకుండా ఉన్న సెక్షన్లు ఏవో చెప్పండి అని స్వచ్ఛంద సంస్థ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. మహిళల సాధికారత కోసం ఐపీసీ 498ఏ (బీఎన్ఎస్ 84), సీఆర్‌పీసీ 125 సెక్షన్లను పొందుపర్చారని, కొన్ని ఘటనల్లో దుర్వినియోగం అయ్యాయన్న సాకుతో వాటి స్ఫూర్తిని దెబ్బతీయలేమని స్పష్టం చేసింది. ఈ సెక్షన్ల దుర్వినియోగంతో బాధితులుగా మారిన ఎవరైనా కోర్టులను ఆశ్రయించవచ్చని, ఆయా కేసుల్లో మెరిట్‌ను బట్టి న్యాయస్థానాలు నిర్ణయం తీసుకుంటాయని తెలిపింది. అయితే పురుషులు కూడా భార్యలపై మెయింటెనెన్స్ కోసం కేసులు వేసే అవకాశం ఉండాలని స్వచ్ఛంద సంస్థ తరఫు న్యాయవాది పేర్కొనగా.. కోర్టులు చట్టాలు చేయలేవని, పార్లమెంటు ఆ పని చేయాలని పేర్కొంది. ఈ మేరకు పిల్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.

# పిల్లల అక్రమ రవాణా జరిగితే ఆస్పత్రుల లైసెన్స్ రద్దు

## అక్రమ రవాణా నిరోధం, కేసుల పరిష్కారానికి సుప్రీం మార్గదర్శకాలు

## కేసులను ఆరు నెలల్లో పూర్తిచేయాలని హైకోర్టులకు ఆదేశం

'ఎవరైనా మహిళ ప్రసవించడానికి హాస్పిటల్‌కు వచ్చినప్పుడు, ఆమెకు పుట్టిన నవజాత శిశువును అన్ని విధాలుగా కాపాడడం ఆ ఆస్పత్రి బాధ్యత. ఒకవేళ ఆస్పత్రి నుంచి ఆ నవజాత శిశువు అక్రమ రవాణా జరిగేతే ఆ ఆస్పత్రి లైసెన్స్ రద్దు చేయాలి' అని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. చిన్నారుల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం 95 పేజీలతో కూడిన తీర్పును వెలువరించింది. ఇందులో 92 కీలక అంశాలను ప్రస్తావిస్తూ ధర్మాసనం ముందున్న అన్ని పిటిషన్లను ముగించింది. ఈ సందర్భంగా యుపిలో పిల్లల అక్రమ రవాణా ఆరోపణలు ఎదుర్కొంటున్న 13 మందికి అలహాబాద్ హైకోర్టు బెయిల్ ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ తీర్పుపై కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ చేయకపోవడాన్ని తప్పుబట్టింది. చైల్డ్ ట్రాఫికింగ్‌కు సంబంధించి బాధితులు పింకితోపాటు మరో 17 స్పెషల్ లీవ్ పిటిషన్లపై తీర్పులో కీలక అంశాలను

ప్రస్తావించింది. ఆస్పత్రిలో జన్మించిన నవజాత శిశువు అక్రమ రవాణా జరిగేతే ఆ ఆస్పత్రి లైసెన్స్ రద్దు చేయాలని స్పష్టం చేసింది. తీర్పు ప్రతుల్ని అన్ని హైకోర్టులకు, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలని సుప్రీం కోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఆదేశాలను హోంశాఖ, మహిళా - శిశుఅభివృద్ధి మంత్రిత్వశాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలకు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## మరణం కంటే దారుణమైంది

*'పిల్లలు చనిపోయినప్పటికంటే, అపహరణకు గురైనప్పుడు తల్లిదండ్రులు ఎదుర్కొనే బాధ, వేదన భిన్నమైంది. పిల్లలు చనిపోయినప్పుడు కాలక్రమేణా మరిచిపోతారు కానీ, పిల్లలు తప్పిపోయి కనిపించనప్పుడు జీవితాంతం బాధ అనుభవించాల్సి ఉంటుంది. ఇది మరణం కంటే దారుణమైంది'*

- సుప్రీంకోర్టు

## మార్గదర్శకాలు

దేశంలో పిల్లల అక్రమ రవాణా కేసుల స్థితిగతులపై పూర్తి వివరాలు సమర్పించాలని, విచారణలు ఆరు నెలల్లోపు పూర్తిచేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల హైకోర్టులను సుప్రీంకోర్టు ఆదేశించింది. సమయం సరిపోదు అనుకుంటే ప్రతిరోజూ ఆ కేసులను విచారణ చేపట్టాలని పేర్కొంది. అపహరణకు గురైన పిల్లలను గుర్తించి విద్యా చట్టం కింద వారిని పాఠశాలల్లో చేర్పించాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను ఎవరైనా పాటించకపోతే కోర్టు ధిక్కారంగా పరిగణిస్తామని హెచ్చరించింది. ఒక మీడియా సంస్థ నివేదికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఢిల్లీ లోపల, బయట అక్రమ రవాణా గ్యాంగ్‌లకు సంబంధించిన కేసులో పోలీసులు తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై ఈ నెల 21న విచారణ చేపడతామని వెల్లడించింది. చైల్డ్ ట్రాఫికింగ్‌లో కిడ్నాపర్లు తమ స్మార్ట్ ఫోన్ల ద్వారా నెట్‌వర్క్‌గా పని చేస్తున్నారని, ఇతర రాష్ట్రాలకు విక్రయించేందుకు, కొనుగోలు చేసేందుకు వాటిని వినియోగిస్తున్నారని ప్రస్తావించింది.

కొన్ని రోజుల క్రితం ఉత్తర ప్రదేశ్‌లోని ఓ ఆస్పత్రిలో నవజాత శిశువు అపహరణకు గురవడంతో దర్యాప్తు చేసిన పోలీసులు అంతర్రాష్ట్ర ముఠా ఈ వ్యవహారంలో ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసు అలహాబాద్ హైకోర్టుకు వెళ్లడంతో.. 13 మంది నిందితులకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీనిపై బాధిత తల్లిదండ్రులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వ్యవస్థీకృతంగా పిల్లల అక్రమ రవాణా జరుగుతోందంటూ యుపికి చెందిన సంజరు, మరో 17 మంది పిటిషన్లు వేశారు. ఢిల్లీలోని ఓ ధనిక వ్యక్తికి యుపిలో జన్మించిన పసికందును

ఆ ముఠా రూ.5 లక్షలకు విక్రయించిందని సంజరు తరపు సీనియర్ న్యాయవాది అపర్ణభట్.. ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో బెయిల్ ఎలా మంజూరు చేస్తారని అలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 'అలహాబాద్ హైకోర్టు నిర్ణయంతో విభేదిస్తున్నాం. కనీసం ప్రతివారం పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాలని షరతు విధిస్తే బాగుండేది. ప్రస్తుతం నిందితుల జాడను పోలీసులు కోల్పోయారు. వారు సమాజానికి పెద్ద ముప్పు. పిల్లల అక్రమ రవాణాకు వాళ్లు నిరంతరం ప్రయత్నాలు చేస్తుంటారు' అంటూ ఘాటుగా స్పందించింది. అలహాబాద్ హైకోర్టు తీరును తప్పుబడుతున్నామన్నారు. నిందితులందరూ లొంగిపోవాలని, వారిని కస్టడీకి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. రెండు వారాల్లో కేసులను సెషన్స్ కోర్టుకు అప్పగించాలని వారణాసి సిజెఎం, ఎసిఎంలకు ఉత్తర్వులు జారీ చేసింది. బెయిల్ మంజూరైతే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని సుప్రీంకోర్టు.. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని నిలదీసింది. అప్పీల్‌కు వెళ్లాలనే ఆలోచన కూడా ప్రభుత్వానికి కలగలేదా అంటూ తీవ్ర స్థాయిలో మందలించింది.

# వాహన ప్రమాదాల్లో క్షతగాత్రులకు నగదు రహిత వైద్యం ఇంకెప్పుడు: సుప్రీంకోర్టు

వాహన ప్రమాదాల్లో క్షతగాత్రులకు నగదు రహిత వైద్యం అందించేలా పథకాన్ని రూపొందించే విషయంలో కేంద్రం జాప్యం చేస్తుండటంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. జనవరి 8న తామిచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడంపై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. "గతంలో ఇచ్చిన గడువు మార్చి 15తో తీరిపోయింది. అయినా స్పందించలేదంటే ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమే కాదు. చాలా ఉపయోగకరమైన చట్టాన్ని అమలు చేయకుండా ఉండటమే" అని ధర్మాసనం మండిపడింది. ఈనెల 28న మంత్రిత్వ శాఖ కార్యదర్శి నేరుగా వచ్చి కోర్టులో వివరణ ఇవ్వాలని బెంచ్ ఆదేశించింది.

## డ్రైవర్ల పనిగంటలపై రాష్ట్రాలకు కీలక ఆదేశాలు

దేశంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రమాదంలో గాయపడిన వారికి సత్వరమే చికిత్స అందించేందుకు వీలుగా మార్గదర్శకాలను రూపొందించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఇందుకోసం ఆరు నెలల గడువును విధించింది. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్

ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం చెప్పింది. డ్రైవర్లకు పనిగంటల విధానం అమలుపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని కేంద్ర రోడ్డు రవాణ, రహదారుల మంత్రిత్వ శాఖకు సూచించింది.

దేశంలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో గాయపడినవారిలో చాలా మందికి సత్వరం చికిత్స అందడం లేదు. ఇంకా కొన్ని ఘటనల్లో గాయపడకపోయినా వాహనాల్లోనే చిక్కుకుపోతున్నారు. అందుకే వీరిని వేగంగా సాయం అందించే విధంగా ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం నిబంధనలు రూపొందించాలని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది.

# సివిల్ వివాదంపై క్రిమినల్ కేసులా?

## ఉత్తరప్రదేశ్ పోలీసులకు
## రూ.50వేలు జరిమానా విధించిన సుప్రీంకోర్టు

ఓ సివిల్ వివాదంపై క్రిమినల్ కేసు బుక్ చేసిన ఇద్దరు ఉత్తరప్రదేశ్ పోలీస్ అధికారులకు సుప్రీంకోర్ట్ రూ.50,000 జరిమానా విధించింది. ఆస్తులకు సంబంధించిన వివాదాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సివిల్ వివాదాలపై ఎఫ్ఐఆర్ నమోదును సవాల్ చేస్తూ సుప్రీంకోర్ట్‌లో పిటిషన్లు వెల్లువెత్తుతున్నాయని, ఈ ఆచారం 'న్యాయస్థానాలు ఇచ్చిన అనేక తీర్పులను ఉల్లంఘించడం' కిందకే వస్తుందని పేర్కొంది. 'సివిల్ వివాదాలపై క్రిమినల్ కేసులు దాఖలు చేయడం ఆమోదయోగ్యం కాదు' అని సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అయితే ఈ కేసులో పోలీసు అధికారులపై విధించిన జరిమానాను మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సుప్రీంకోర్ట్ ధర్మాసనాన్ని కోరారు. కానీ సర్వోన్నత న్యాయస్థానం ఈ జరిమానాను మాఫీ చేయడానికి నిరాకరించింది. "మీరు రూ.50,000 జరిమానా చెల్లించండి. తరువాత ఆ ఇద్దరు పోలీసు అధికారుల నుంచి ఆ డబ్బులను వసూలు చేసుకోండి" అని సుప్రీం ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది.

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన రిఖాబ్ బిరానీ, సాధన బిరానీ తమకు ఉన్న ఓ గిడ్డంగిని శిల్పి గుప్తా అనే ఆమెకు రూ.1.35 కోట్లకు విక్రయించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనితో శిల్పి గుప్తా అడ్వాన్స్ కింద రూ.19 లక్షలు చెల్లించారు. మరో 25 శాతం మొత్తాన్ని 2020 సెప్టెంబర్ 15లోపు ఇస్తామన్నారు. కానీ ఆ గడువులోగా ఆ డబ్బు చెల్లించలేకపోయారు. దీనితో బిరానీలు ఆ గిడ్డంగిని మరో వ్యక్తికి రూ.90 లక్షలకు

విక్రయించారు. కానీ శిల్పి గుప్త చెల్లించిన రూ.19 లక్షలను తిరిగి ఇవ్వలేదు. దీనితో ఆమె బిరానీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని క్రిమినల్ కోర్టును ఆశ్రయించారు. కానీ ఆ ప్రయత్నం విఫలమైంది. ఇది సివిల్ కేసు కనుక క్రిమినల్ కేసుగా పరిగణించి దర్యాప్తు చేయమని ఆదేశించలేమని స్థానిక కోర్ట్ తెలిపింది.

అయితే స్థానిక పోలీసులు మాత్రం మోసం, క్రిమినల్ బెదిరింపులు లాంటి నేరాలను మోపుతూ బిరానీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐర్‌ను రద్దు చేయడానికి అలహాబాద్ హైకోర్ట్ నిరాకరించింది. బిరానీలు విచారణను ఎదుర్కోవాల్సిందేనని చెప్పింది. దీనితో వారు సుప్రీంకోర్ట్‌ను ఆశ్రయించారు. తాజాగా దీనిని విచారించిన సుప్రీంకోర్ట్, 'శిల్పి గుప్తా వేసిన రెండు వేర్వేరు పిటిషన్లను స్థానిక మెజిస్టీరియల్ కోర్ట్ రెండు సార్లు తిరస్కరించినా, రాష్ట్ర పోలీసులే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు "యూపీలో చట్టబద్ధమైన పాలన పూర్తిగా దెబ్బతింది. సివిల్ అంశాన్ని క్రిమినల్ కేసుగా మార్చడం ఆమోదయోగ్యం కాదు" అని వ్యాఖ్యానించింది. అంతేకాదు ఈ కేసులో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర పోలీస్ డైరెక్టరేట్ జనరల్‌ను ఆదేశించింది.

# భాషకు మతం లేదు!

నేమ్ బోర్డ్‌ల్లో ఉర్దూ భాష ఉపయోగించడానికి సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్ట్ కొట్టివేసింది. 'భాష అనేది మతం కాదని' వ్యాఖ్యానించింది.

మహారాష్ట్ర, అకోలా జిల్లా, పాటూరు మాజీ కౌన్సిలర్ వర్షతాయ్ సంజయ్ బగాడే- మున్సిపల్ కౌన్సిల్ పరిధిలోని నేమ్ బోర్డ్‌లపై మరాఠీతోపాటు ఉర్దూ భాషను ఉపయోగించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్ట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. అధికారిక కార్యకలాపాలు అన్నీ మరాఠీలోనే జరగాలని, ఉర్దూ వాడకాన్ని అనుమతించకూడదని అందులో పేర్కొన్నారు. ఇంతకు ముందు అమె చేసిన ఈ అభ్యర్థనను మున్సిపల్ కౌన్సిల్ తిరస్కరించింది. దీనితో ఆమె బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా, అక్కడా కూడా ఆమెకు అనుకూలంగా తీర్పు రాలేదు. దీంతో ఆమె సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ సుధాంశ్ ధులియా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. "భాష అనేది ఒక సమాజానికి, ప్రాంతానికి, ప్రజలకు చెందినది. భాష ఒక మతానికి చెందినది కాదు. భాష అనేది ఒక సంస్కృతి. సమాజం, ప్రజల నాగరికత పురోగతిని కొలవడానికి ఇది ఒక కొలమానం. ఉర్దూ భాష విషయంలోనూ అంతే" అని పేర్కొంది. "స్థానికులకు అర్థం అయ్యే భాష కనుకనే, మున్సిపల్ కౌన్సిల్ ఉర్దూను నేమ్ బోర్డ్‌ల్లో ఉంచింది. 2022 చట్టం

సహా ఇతర ఏ చట్టంలోని నిబంధనల్లోనూ ఉర్దూ వాడకంపై నిషేధం లేదు. హైకోర్ట్ ఇచ్చిన తీర్పుతో మేము ఏకీభవిస్తున్నాం' అని చెప్పి సుప్రీంకోర్ట్ ఈ పిటిషన్‌ను కొట్టేసింది.

## పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు కేసుల సమాచారం ఇవ్వాల్సిందే

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమపై ఉన్న పెండింగ్ కేసుల వివరాలను వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లేకుంటే ఎన్నికను రద్దు చేయవచ్చని తెలిపింది. కేసుల వివరాలు వెల్లడించకుంటే అది తప్పుడు అఫిడవిట్ కిందకు వస్తుందని, దాన్ని ఆధారంగా ఎన్నికను కొట్టివేయవచ్చని పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ గ్రామ ప్రధాన్ ఎన్నిక రద్దుకు సంబంధించిన ఓ కేసులో ఈ మేరకు స్పష్టం చేసింది. మండీ జిల్లా పంగన గ్రామ ప్రధాన్‌గా పనిచేసిన బసంత్‌లాల్ క్రిమినల్ కేసు వివరాలను దాచి పెట్టారంటూ ప్రత్యర్థి ఆయనపై గతంలో కేసు పెట్టారు. విచారణ జరిపిన కింది కోర్టులు, హైకోర్టు ఆ ఎన్నికను రద్దు చేయడంతో పాటు, ఆరేళ్ల పాటు పోటీ చేయకూడదంటూ బసంత్‌పై అనర్హత వేటు వేశాయి. దీంతో, ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై క్రిమినల్ కేసును కోర్టు ఎప్పుడో కొట్టేసిందని, ప్రస్తుతం తనపై ఎలాంటి కేసులు లేవని, అయినా ఆరేళ్లపాటు అనర్హత వేటు వేశారని ఆయన వాదించారు. ఇది తీవ్రమైన శిక్ష అని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. అనర్హత వేటు ఆదేశాలు 8 వారాల పాటు అమలు చేయకుండా నిలిపివేసింది.

# డిజిటల్ యాక్సెస్ ప్రాథమిక హక్కు

## సుప్రీంకోర్టు కీలక తీర్పు

డిజిటల్ యాక్సెస్ ఓ ప్రాథమిక హక్కు అని, ప్రజలందరికీ దానిని ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికైనా, సమాజంలో వెనుకబాటుకు గురవుతున్న వర్గాల వారికైనా సమానంగా డిజిటల్ సేవలు అందాల్సిందేనని పేర్కొంది. రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాల(పిల్)ను విచారించిన జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ ఆర్.మాధవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ చరిత్రాత్మక తీర్పును బుధవారం వెలువరించింది. డిజిటల్ అంతరాలను తగ్గించడం ఇక ఎంతమాత్రం విధానపరమైన విచక్షణకు సంబంధించిన అంశం కాదని, గౌరవప్రదంగా జీవించే హక్కును పరిరక్షించేందుకు రాజ్యాంగపరమైన ఆవశ్యకత ఉన్న అంశంగా మారిందని ధర్మాసనం స్పష్టం చేసింది. "ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర సేవలు, పాలన, విద్య, ఆరోగ్య భద్రత, ఆర్థిక అవకాశాలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అందుతున్నాయి. ఈ సాంకేతిక

యుగంలో రాజ్యాంగంలోని అధికరణ 21 కింద జీవించే హక్కును పునర్నిర్వచించి ప్రస్తుత పరిస్థితులకు అన్వయించుకోవాల్సిన అవసరం తప్పనిసరిగా ఉంది. అసమానలతో కూడిన డిజిటల్ పరికరాలు, నైపుణ్యం, కంటెంట్ ద్వారా డిజిటల్ విభజన కొనసాగుతోంది" అని కోర్టు పేర్కొంది. కోర్టు విచారించిన రెండు పిల్స్‌లో ఒకటి యాసిడ్ దాడి బాధితురాలు ప్రజ్ఞ ప్రసూన్ దాఖలు చేశారు. ఓ బ్యాంకులో ఖాతా తెరిచేందుకు నో యువర్ కస్టమర్ (కేవైసీ) సమర్పణలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు. యాసిడ్ దాడిలో తన ముఖం ఆకృతి మారిపోవడంతో పాటు, కళ్లకు కూడా చాలా నష్టం కలగడంతో కనురెప్పలను మూయలేక బ్యాంకులో లైవ్ కేవైసీ పూర్తి చేయలేకపోయానని ఆమె వాపోయారు. తనలాంటి యాసిడ్ దాడి బాధితుల విషయంలో కేవైసీ పూర్తి చేయడానికి కేంద్రానికి తగిన మార్గదర్శకాలు జారీచేయాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా కేవైసీ విధివిధానాలను మార్చాల్సిన ఆవశ్యకత ఉందని ధర్మాసనం స్పష్టం చేస్తూ 20 మార్గదర్శకాలను జారీ చేసింది.

# మహిళా ఆర్మీ అధికారుల స్థైర్యాన్ని దెబ్బతీయొద్దు

## సుప్రీం కీలక వ్యాఖ్యలు

షార్ట్ సర్వీస్ కమిషన్ కింద ఎంపికైన మహిళా ఆర్మీ అధికారులకు సుప్రీంకోర్టు నుంచి స్వల్ప ఉపశమనం లభించింది. వారిని ప్రస్తుతానికి సర్వీసు నుంచి విడుదల చేయవద్దని అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని ఆదేశించింది. తమకు శాశ్వత కమిషన్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ 69 మంది మహిళా ఆర్మీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తులు సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ప్రస్తుతం వారిని సర్వీసు నుంచి విడుదల చేయవద్దని, వారి సర్వీసులను వేరే చోట ఉపయోగించుకోవచ్చని ధర్మాసనం పేర్కొంది. "ఇది కోర్టు చుట్టూ తిరగాల్సిన సమయం కాదు. దేశానికి సేవ చేసేందుకు వారికి మంచి స్థానం ఉంది" అని జస్టిస్ కాంత్ వ్యాఖ్యానించారు. భారత సైన్యానికి యువ అధికారులు అవసరమని, ప్రతి సంవత్సరం 250 మంది సిబ్బందికి మాత్రమే శాశ్వత కమిషన్ మంజూరు చేస్తున్నారని అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తన వాదనలు వినిపించారు. షార్ట్ సర్వీసు

నుంచి విడుదల చేయడానికి సంబంధించి ఎలాంటి స్టే ఇవ్వొద్దని కోర్టును కోరారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది మనేక గురుస్వామి వాదిస్తూ, ఆపరేషన్ సిందూర్ గురించి ఇటీవల వివరించిన ఇద్దరు మహిళా అధికారుల్లో ఒకరైన సోఫియా ఖురేష్ ప్రస్తావన చేశారు. సోఫియా గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించి ఉపశమనం పొందారని, ఇప్పుడు దేశాన్ని గర్వపడేలా చేస్తున్నారని అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణ వరకూ పిటిషన్లు వేసిన అధికారును విడుద చేయవద్దని ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను ఆగస్టుకు వాయిదా వేసింది.

# సహజీవనానికి సమ్మతే కీలకం

## వివాహ హామీతో శారీరకంగా కలిశాననే వాదన చెల్లదు

## రేప్ కేసును కొట్టేస్తూ సుప్రీం వ్యాఖ్యలు

ఆర్థిక స్వాతంత్ర్యం పొందిన మహిళలు సహజీవన బంధంలోకి ప్రవేశించడం ఈనాడు చాలా మామూలు వ్యవహారంగా మారిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వయోజనులైన యువతి, యువకుడు సహజీవన బంధంలోకి ఇష్టపూర్వకంగా వస్తున్నారంటేనే దానివల్ల రాగల పరిణామాల పట్ల పూర్తి అవగాహన వారికి ఉన్నదనే భావించాల్సి ఉంటుందని పేర్కొంది. వివాహం చేసుకుంటానని హామీ ఇవ్వడం వల్లే తాను ఆ బంధానికి అంగీకరించానని చేసే వాదన చెల్లదని అభిప్రాయపడింది. ఓ వ్యక్తిపై అతని సహజీవన భాగస్వామి చేసిన అత్యాచార అభియోగాలను కొట్టివస్తూ ఇచ్చిన తీర్పులో భాగంగా న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో చిన్న ఫిర్యాదు కూడా లేకుండా రెండేళ్లకు పైగా శారీరక సంబంధంలో ఇరువురూ కొనసాగారని బెంచ్ గుర్తించింది. అంతకాలం ఆ సంబంధంలో కొనసాగారంటేనే సంపూర్ణ అవగాహన, అంగీకారం, ఇష్టంతోనే ఆ పని చేశారనే వాదనకు బలం చేకూరుతుందని తెలిపింది. అందువల్ల ఇలాంటి కేసుల పట్ల కోర్టు మరీ పండిత చర్చలకు దిగకుండా ఉండటం మంచిదని సూచించింది. వివాహం చేసుకోవాలనే తలంపుతోనే సహజీవనం చేశారా లేదా అనేదీ అప్రస్తుతమని తెలిపింది. ఎంతకాలంగా కలిసి ఉంటున్నారు.. దానిపట్ల ఇరువురికీ అవగాహన, అంగీకారం ఉన్నాయా లేదా, భాగస్వాముల ప్రవర్తన ఎలాంటిది అనే అంశాలను మాత్రం పరిగణించి కోర్టు నిర్ణయం తీసుకుంటే చాలునని బెంచ్ అభిప్రాయపడింది.

# విడాకుల కేసుల్లో మధ్యవర్తిత్వమే మేలు

## విఫలమైతేనే విచారణ వరకు వెళ్లాలి - జస్టిస్ బి.వి.నాగరత్న సూచన

భార్యాభర్తల విడాకుల కేసుల్లో తొలుత మధ్యవర్తిత్వం జరపాలని, అది విఫలమయితేనే విచారణ వరకు వెళ్లాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న సూచించారు. శనివారం బెంగళూరులో 'భారత సమాజానికి కుటుంబమే పునాది' అన్న అంశంపై జరిగిన చర్చలో ఆమె ప్రసంగిస్తూ కుటుంబ న్యాయస్థానంలో కేసు విచారణకు రాక ముందే తప్పనిసరిగా మధ్యవర్తిత్వం జరగాలన్నారు. కోర్టులో తొలుత వాదనలు జరిగితే దంపతుల మధ్య దూరం మరింత పెరిగే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. అందువల్ల ఫ్యామిలీ కోర్టుల్లో శిక్షణ పొందిన నిపుణులు లేదా విశ్రాంత న్యాయమూర్తులు మధ్యవర్తులుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో పురోగతి సాధించడం దాంపత్య జీవితాల విచ్ఛిన్నానికి కారణమవుతోందన్నది కేవలం అపోహ మాత్రమేనని అభిప్రాయపడ్డారు. అది ఏ మాత్రం సరికాదని చెప్పారు. గత పదేళ్లలో జరిగిన వివాహాల్లో సుమారు 40 శాతం విడాకులకు దారి తీశాయని ఇటీవలే ఒక సర్వేలో తేలిందని గుర్తు చేశారు. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోవాలని, ఒకరిపై మరొకరు గౌరవం కలిగి ఉండాలని చెప్పారు.

# కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్ వద్దు



కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్ చేయరాదంటూ తమిళనాడులోని అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాలకు సర్క్యులర్ జారీ చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. దక్షిణభారత సెంగుంద మహాజన సంఘం నిర్వహణ కోసం ప్రత్యేక అధికారిని నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భరత చక్రవర్తి నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. కులాలను ప్రోత్సహించే సంఘాలను

రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదు చేయవచ్చా, అదేవిధంగా విద్యాసంస్థల పేర్లలో ఉన్న కులాల పేర్లను తొలగించడం సాధ్యమా? అనే అంశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. కులాల పేరుతో సంఘాల రిజిస్ట్రేషన్లు చేయరాదంటూ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సర్క్యులర్లు జారీచేయాల్సిందిగా ఆ శాఖ ఐజీని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా కులసంఘాలు నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల నేమ్‌బోర్డుల్లో ఉన్న కులాలను నాలుగు వారాల్లోపు తొలగించాలని స్పష్టం చేసింది. లేని పక్షంలో సంబంధిత విద్యాసంస్థల లైసెన్సును రద్దు చేయాలని విద్యాశాఖను ఆదేశించింది. అంతేకాకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న కల్లర్, ఆదిద్రావిడుల సంక్షేమ పాఠశాలల పేర్లను కూడా తొలగించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

# జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా అనుసంధానం

## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయబోతున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తద్వారా ఓటరు జాబితాను కచ్చితత్వంతో నవీకరించడంతో పాటు ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత పెంచడానికి వీలవుతుందని పేర్కొంది. ఇందుకోసం మరణాలకు సంబంధించిన సమాచారాన్ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) నుంచి ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు పొందుతామని తెలిపింది. మరణించిన వారి కుటుంబాల నుంచి సమాచారం వచ్చే వరకు వేచిచూడకుండా.. ఆర్‌జీఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారని ఎన్నికల సంఘం వెల్లడించింది.

అలాగే ఓటరు సమాచార చీటీ (వీఐఎస్) ఓటర్లకు మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా అందులోని వివరాలను పెద్ద అక్షరాలతో ఉండేలా రూపొందించాలని ఈసీ నిర్ణయించింది. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని తేలికగా గుర్తించడంతో పాటు పోలింగ్ అధికారులు కూడా జాబితాలోని పేర్లను సులభంగా చూసుకునేందుకు సౌకర్యంగా ఉంటుందని తెలిపింది. దీంతో పాటు బూత్ స్థాయి అధికారులకు ఫొటో ఐడీ కార్డు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది.

# 'మహిళ' అంటే అసలైన అర్థం ఇదే

## యూకే సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు



'మహిళ' అనే పదానికి అర్థం ఏంటో యూకేలోని సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 'మహిళ'అంటే చట్టపరంగా ఇదే అర్థం వస్తుందని పేర్కొంది. ఒక మహిళను చట్టపరంగా ఎలా నిర్వచించాలన్న దానిపై యూకే సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అమ్మాయిలుగా పుట్టినవారికి మాత్రమే చట్టప్రకారం, లింగపరంగా మహిళల గుర్తింపు దక్కుతుందని యూకే సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. స్కాట్ లాండ్ ప్రభుత్వం ఓ మహిళా గ్రూప్ కేసులో భాగంగా యూకేలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ చారిత్రాత్మక తీర్పును వెల్లడించింది. ఎన్నో ఏళ్లపాటు సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత ఈ తీర్పు వెల్లడైంది. సమానత్వ చట్టం- 2010 ప్రకారం 'స్త్రీ' 'లింగం' అనే పదాలు పుట్టుకతో అమ్మాయిలుగా పుట్టినవారిని, పుట్టుకతో ఏ లింగానికి చెందినవారు అన్న విషయాలను మాత్రమే సూచిస్తాయని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. లింగమార్పిడి చేయించుకున్నంత మాత్రాన మహిళ కాదని ఈ మేరకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లింగ గుర్తింపు సర్టిఫికెట్(జీఆర్సీ)తో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు లింగ ఆధారిత రక్షణ హక్కు కలిగి ఉంటారని స్కాట్ లాండ్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే, ట్రాన్స్ జెండర్‌లకు రక్షణ ఉంటుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి లార్డ్ హొడ్జ్ తెలిపారు. 'లింగం' అనే పదం అర్థాన్ని లండన్ కోర్టు న్యాయమూర్తులు తమ తీర్పులో వెల్లడించారు. పుట్టుకతో వచ్చే లింగం గుర్తింపా? లేక 2004 లింగ గుర్తింపు చట్టం ప్రకారం లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తులు పొందే సర్టిఫికెట్ ఆధారంగా లభించే న్యాయపరమైన గుర్తింపా? అన్నది సుప్రీంకోర్టు తేల్చింది. ట్రాన్స్ జెండర్ వ్యక్తుల (లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తులు) విషయంలో ఈ తీర్పు స్పష్టతనిచ్చింది. ఒకే లింగానికే(ఆడ లేదా మగ) చెందిన స్థలాలు, సేవలు, సమాన వేతనాలు, ప్రసూతి విధానం, క్రీడా కార్యక్రమాలు వంటివాటిపై ఈ తీర్పు ప్రభావం చూపొచ్చని నిపుణులు అంటున్నారు.

# అంతరిక్షంలోకి సునాయాసంగా..

## ఆరుగురు మహిళల అంతరిక్ష యానం



అంతరిక్ష యాత్ర చరిత్రలో మరో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. ప్రపంచంలోని అగ్రగామి అంతరిక్ష సంస్థలలో ఒకటైన బ్లూ ఆరిజిన్ జెఫ్ బెజోస్ స్థాపించిన ఈ సంస్థ, ఇటీవల జరిగిన ఎన్ఎస్-31 మిషన్ ద్వారా ఓ చారిత్రాత్మక ఘట్టాన్ని సాధించింది. ఇది ప్రత్యేకమైన మిషన్, ఎందుకంటే తొలిసారి పూర్తిగా ఆరుగురు మహిళలతో కూడిన సిబ్బందితో అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ మిషన్ ద్వారా ఆరుగురు అసాధారణమైన మహిళలు కార్మాన్ రేఖను దాటి, భూమిని నక్షత్రాల కోణంలో చూసే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. బ్లూ ఆరిజిన్‌కి ఇది 11వ మానవ అంతరిక్ష ప్రయోగం. మొత్తంగా 31వ విమానం. అమెరికాలోని టెక్సాస్, వాన్ హార్న్ ప్రాంతం నుంచి ఈ ప్రయాణం ప్రారంభమైంది. తెల్లవారుజామున గగనాన్ని చీల్చుకుంటూ న్యూషెపర్డ్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇది పూర్తిగా ఆటోమేటెడ్ (స్వయం నియంత్రిత) కాప్సూల్. ఇందులో ప్రయాణించిన ఆరుగురు మహిళలు దాదాపు 100 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కార్మాన్ రేఖను దాటారు. ఇది భూమి వాతావరణం, అంతరిక్షం మధ్య సరిహద్దుగా పరిగణించబడుతుంది. ఈ ప్రయాణం 10

నిమిషాలకు పైగా కొనసాగింది. అంతలోనే, సిబ్బంది బరువులేని స్థితిని అనుభవించారు. ఒకప్పుడు కేవలం శాస్త్రవేత్తలకు మాత్రమే సాధ్యమైన అనుభూతి ఇది. అనంతరం క్యాప్సూల్ భూమి వైపు పయనమై, టెక్సాస్ ఎడారిలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ యాత్రలో ఆరుగురు మహిళలు ప్రయాణించి అనేక మందికి మార్గదర్శకులుగా నిలిచారు. ఈ మహిళలు విభిన్న నేపథ్యాల నుంచి వచ్చారు, కానీ వారిలోని సాహసస్ఫూర్తి మాత్రం ఒకటే కావడం విశేషం.

ఐషా బోవ్ - ప్రతిభావంతమైన ఏరోస్పేస్ ఇంజనీర్. మహిళల్ని సాంకేతిక రంగాల్లో ప్రోత్సహించడంలో ఆమె పాత్ర కీలకం.

అమండా న్గుయెన్ - సామాజిక న్యాయానికి మార్గదర్శకురాలు. యునైటెడ్ నేషన్స్‌తో సహా అనేక వేదికలపై తన గళాన్ని వినిపించిన యోధురాలు.

గేల్ కింగ్ - సీబీఎస్ మార్నింగ్స్ హోస్ట్, జాతీయ స్థాయిలో ప్రసిద్ధి పొందిన జర్నలిస్ట్

కేటీ పెర్రీ - ప్రపంచప్రసిద్ధ పాప్ గాయని, సంగీతం ద్వారా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకుంది.

కెరియాన్ ఫ్లిన్ - చిత్ర నిర్మాత

లారెన్ సాంచెజ్ - రచయిత్రి, టీవీ హోస్ట్, జెఫ్ బెజోస్ జీవిత భాగస్వామి.

క్యాప్సూల్ భూమిపై సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత, ఆరుగురు మహిళలు తమ భావోద్వేగాలను పంచుకున్నారు. ప్రతి ఒక్కరి మాటల్లో ఆశ్చర్యం, ఆనందం వ్యక్తమయ్యాయి. లారెన్ సాంచెజ్ తన కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. “భూమి అంత నిశ్శబ్దంగా ఉందనుకోలేదు. అది ఒక అద్భుతమైన దృశ్యం” అని ఆమె అన్నారు. క్యాప్సూల్ తలుపు తెరిచిన జెఫ్ బెజోస్ ఆమెను హత్తుకున్న ఆ క్షణం భావోద్వేగాలతో నిండిపోయింది.

### చరిత్రలో స్థానం

1963లో సోవియట్ యూనియన్‌కు చెందిన వాలెంటినా టెరెష్కోవా మొదటి మహిళగా అంతరిక్షంలోకి ప్రయాణించినప్పటి నుంచి, మహిళలు అంతరిక్ష రంగంలో అనేక విజయాలు సాధించారు. అయితే, ఎన్ఎస్-31 మిషన్ పూర్తిగా మహిళలతో కూడిన సిబ్బందితో నిర్వహించబడిన మొదటి విమానంగా చరిత్రలో స్థానం సంపాదించింది. బ్లూ ఆరిజిన్ ఈ సందర్భాన్ని అంతరిక్ష పరిశోధనలో లింగ సమానత్వం వైపు ఒక ముందడుగుగా దీనిని గుర్తించింది.

2021 నుంచి బ్లూ ఆరిజిన్ 10 మానవ విమానాలలో 52 మందిని అంతరిక్ష అంచుకు తీసుకెళ్లింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ సంస్థ మొదటి మానవ విమానంలో జెఫ్ బెజోస్ స్వయంగా పాల్గొన్నారు.

# వయసు 21.. పెళ్లిళ్లు 12

## వివాహమైన వెంటనే నగలు, నగదుతో పరార్

## యూపీలో 'దొంగ పెళ్లి కూతురు' అరెస్టు

గుజరాత్‌కు వెళ్తే ఆమె పేరు కాజల్, హరియాణాలో ఉంటే సీమా, బిహార్‌లో నేహా, ఉత్తరప్రదేశ్‌లో అయితే ఆమె పేరు స్వీటీ. అసలు పేరు మాత్రం గుల్షానా రియాజ్ ఖాన్. వయసు 21 ఏళ్లు. ఇప్పటికే 12 సార్లు పెళ్లిళ్లు చేసుకుంది. అందర్నీ మోసగించి ఉడాయించింది. అసలు భర్త రియాజ్ ఖాన్ ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఈ దొంగ పెళ్లిళ్ల వ్యవహారం అతడికి పూర్తిగా తెలుసు. ప్రతి పెళ్లికి 5 శాతం సొమ్మును కమీషన్‌గా కూడా తీసుకుంటున్నాడు. హడావిడిగా పెళ్లి సంబంధం కుదుర్చుకోవడం, ఘనంగా వివాహం చేసుకోవడం, పెళ్లి తంతు ముగిసిన కొద్ది గంటల్లోనే కిడ్నాప్ నాటకమాడి నగలు, నగదుతో పరారు కావడం ఆమెకు నిత్యకృత్యం. ఆ 'దొంగ పెళ్లి కూతురు' (డాకూ దుల్హన్) ఎట్టకేలకు అంబేడ్కర్ జిల్లాలోని కసదాహా గ్రామంలో పోలీసులకు చిక్కింది. ఆమెతో పాటు ముఠాలోని మరో 8మందిని అరెస్టు చేశారు. ఈ ముఠాలో గుల్షానాతోపాటు అయిదుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. పలు రాష్ట్రాల్లో దొంగ పెళ్లిళ్ల రాకెట్‌ను ఆ ముఠా చాలా వ్యూహాత్మకంగా నిర్వహించింది. వివాహ వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతగా ప్రయత్నించినా కుమారులకు పెళ్లి చేయలేకపోతున్న కుటుంబాలను మొదట గుర్తించేది. మహిళలు పెళ్లి మాటలు కలిపి ఆ కుటుంబాల నమ్మకం పొందేవారు. గుల్షానాను సంబంధించిన నకిలీ పత్రాలు చూపించి సంబంధాన్ని ఓకే చేసుకునేవారు. సంబంధం కుదిర్చినందుకు 'సెటిల్‌మెంట్ అమౌంట్' కూడా మాట్లాడుకునేవారు. హడావిడిగా పెళ్లి ఏర్పాట్లు చేయించే వారు. పెళ్లి తంతు ముగియగానే మగవారు బైకులుపై వచ్చి ఆమెను 'కిడ్నాప్' చేసే వారు. నగదు, నగలు దక్కించుకునేవారు.

# శిశువుకు జన్మనిచ్చిన మైనర్

## కర్ణాటకలో దారుణం- చెత్తబుట్టలో నవజాత శిశువు మృతదేహం

కర్ణాటకలోని బెంగళూరులో నవజాత శిశువు మృతదేహాన్ని చెత్తబుట్టలో విసిరేసిన ఘటన కలకలం రేపింది. ఈ కేసులో నిందితుడిని యలహంక పోలీసులు అరెస్టు చేశారు. మైనర్ ను గర్భవతిని చేసిన ఘటనలో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, యలహంకకు చెందిన భరత్ (23) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఓ మైనర్ బాలికతో అతడికి స్నేహం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారింది. తర్వాత మైనర్ తో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. దీంతో మైనర్ గర్భం దాల్చింది. తొమ్మిది నెలలు నిండడం వల్ల ఇటీవలే బిడ్డకు జన్మనిచ్చింది. కానీ శిశువు 10 రోజుల క్రితం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడం వల్ల మరణించింది.

చెత్తబుట్టలో శిశువు మృతదేహం

మరణించిన నవజాత శిశువు మృతదేహాన్ని ఓ కవర్‌లో చుట్టి చెత్తబుట్టలో వేసింది మైనర్. నిందితుడు భరత్ కూడా ఆమెకు సాయం చేశాడు. పొరుగింట్లో ఉన్న ఓ వ్యక్తికి నవజాత శిశువు మృతదేహం ఉన్న చెత్తబుట్టను ఇచ్చి బయట పడేయమంది మైనర్. ఆమె మాటలు నమ్మిన పొరుగింటి వ్యక్తి ఓ ప్రైవేట్ ఆస్పత్రి సమీపంలోని ఖాళీ స్థలంలో చెత్తను పడేశాడు. అయితే చనిపోయిన శిశువు చెత్తలో ఉందని యలహంక పోలీసులకు ఫిర్యాదు అందింది. వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసు ఛేదించిన పోలీసులు

యలహంక పోలీసులు కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఓ వ్యక్తి సైకిల్ పై వచ్చి కవర్‌లో ఉన్న చెత్తను పడేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు చెత్త పడేసిన వ్యక్తిని పట్టుకున్నారు. అతణ్ని ప్రశ్నించగా, తనకేమి తెలియదని చెప్పాడు. పొరుగింట్లో ఉన్న ఓ వ్యక్తి చెత్తను పడేయమంటే అలా చేశానని వెల్లడించాడు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో మైనర్‌ను గర్భవతిని చేసిన భరత్‌ను అరెస్ట్ చేశారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

# వెంటిలేటర్‌పై ఉన్న ఎయిర్ హోస్టెస్‌పై లైంగిక దాడి

అస్వస్థతకు గురై వెంటిలేటర్‌పై ఉన్న ఓ ఎయిర్ హోస్టెస్‌పై ఆసుపత్రి సిబ్బంది ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన హరియాణా గురుగ్రామ్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో జరిగింది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం పోలీసులు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, ఎయిర్ హోస్టెస్‌గా పనిచేస్తున్న మహిళ (46) కంపెనీ తరఫున శిక్షణ కోసం గురుగ్రామ్ వచ్చి, ఓ హోటల్‌లో బస చేశారు. ఈనెల 5న హోటల్‌లో ఉన్న ఈత కొలనులో స్విమ్మింగ్ చేస్తుండగా కింద పడి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను వెంటనే సమీపంలోని ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించారు. అత్యవసర చికిత్స నిమిత్తం ఐసీయూలోని వెంటిలేటర్‌పై ఉంచారు. ఆ మరుసటి రోజే తనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఏప్రిల్ 6న వెంటిలేటర్‌పై ఉన్నప్పుడు తనపై ఆసుపత్రి సిబ్బంది ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారని తెలిపింది. ఈ విషయాన్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక భర్తకు చెప్పింది. దీంతో ఇద్దరూ కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎయిర్ హోస్టెస్ ఫిర్యాదు మేరకు ఆస్పత్రిలోని గుర్తు తెలియని సిబ్బందిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌ను పోలీసులు నమోదు చేశారు. బాధితురాలి వాంగ్మూలాన్ని కోర్టులో న్యాయమూర్తి ఎదుట నమోదు చేశారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఆడపిల్ల పుట్టిందని...

ఉత్తరాఖండ్‌కు చెందిన ఓ జంటకు 2022 నవంబర్ నెలలో పెళ్లయింది. పెళ్లయిన కొన్ని నెలలు వీరి కాపురం సజావుగానే సాగింది. తర్వాతి నుంచి అత్తింటి వారు తమ క్రూర బుద్ధిని బయటపెట్టారు. అదనపు కట్నం కోసం మహిళను వేధించసాగారు. ఆ మహిళకు ఆడపిల్ల పుట్టిన తర్వాత వేధింపులు ఎక్కువ అయ్యాయి. అడిగినంత డబ్బు ఇవ్వనందుకు.. కొడుకును కననందుకు ఆమెను ఇంటినుంచి పంపేశారు. పుట్టింటికి వెళ్లిపోయిన తర్వాత ఆమె విడాకుల కోసం అప్లై చేసింది. ఈ నేపథ్యంలోనే డాక్యుమెంట్లు ఇస్తామని చెప్పి.. అత్తింటివారు ఆమెను ఇంటికి పిలిచారు. ఆమె ఇంటికి వెళ్లగా లోపల బంధించారు. భర్త

స్క్రూడ్రైవర్, సుత్తితో ఆమెపై దాడి చేశాడు. విచక్షణా రహితంగా ఆమెను కొట్టాడు. నొప్పి భరించలేకపోయిన ఆమె గట్టిగా అరవసాగింది. ఆమె అరుపులు విన్న పొరుగింటి వారు అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు. భర్త నుంచి ఆమెను విడిపించారు. దాడిలో తీవ్రంగా గాయడపడ్డ మహిళ.. కొన్ని రోజులు ఆస్పత్రిలో చికిత్స చేసుకుంది. తర్వాత ముఖ్యమంత్రికి, ఉమెన్స్ హెల్ప్‌లైన్, జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై బాధితురాలు మాట్లాడుతూ.. 'వాళ్లు ఎప్పుడూ అదనపు కట్నం కావాలని హింసించే వారు. కొడుకు కావాలనే వారు. వాళ్లకు కావాల్సింది దొరక్కపోవటంతో .. నన్ను ఇంటినుంచి బయటకు పంపేశారు. తర్వాత ఇంటికి పిలిచి నా భర్త సుత్తె, స్క్రూడ్రైవర్‌తో దారుణంగా దాడి చేశాడు. అలాంటి వ్యక్తికి కఠినమైన శిక్ష పడాలి' అని అంది. మార్చి 30వ తేదీన పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన యూట్యూబర్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రియుడితో కలిసి భర్తను చంపిన ఘటన మరువకముందే హరియాణాలోనూ అలాంటి దారుణమే జరిగింది. రవీనా అనే మహిళ తన ప్రియుడుతో కలిసి భర్తను అతి కిరాతకంగా హత్య చేసింది. ఈ కేసులో నిందితులిద్దర్ని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భివానీకి చెందిన ప్రవీణ్, రేవాడిలోని జూడి గ్రామస్థురాలైన రవీనాకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఆరేళ్ల కుమారుడు ముకుల్ ఉన్నాడు. రవీనా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండేది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 34 వేలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. అందులో వీడియోలు పోస్టు చేస్తుండేది. యూట్యూబ్‌లోనూ షార్ట్స్ అప్లోడ్ చేసేది. రవీనాకు ఇన్‌స్టా అంటే చాలా ఇష్టం. అందులో వీడియోలు చేసేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించినప్పటికీ, ఆమె తగ్గేది కాదు. ఇదే విషయంపై పలుమార్లు భర్తతో గొడవ పడేది. సోషల్ మీడియాపై ఇష్టంతో ఉన్న రవీనాకు హిసార్‌లోని ప్రేమ్ నగర్ నివాసి అయిన యూట్యూబర్ సురేశ్ ఏడాదిన్నర క్రితం పరిచయం అయ్యాడు. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి షార్ట్ వీడియోస్ చేసేవారు. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. రవీనా భర్తకు వీరి ప్రవర్తనపై అనుమానం కలిగింది. ఈ క్రమంలోనే మార్చి 25న సురేశ్, రవీనాను కలిసి ఉండటం చూశాడు ప్రవీణ్. దీంతో రవీనాతో ప్రవీణ్ గొడవకు దిగాడు. వెంటనే తన ప్రియుడు

సురేశ్‌తో కలిసి మంచం కింద ఉన్న దుప్పటితో ప్రవీణ్ గొంతును నులిమేసింది రవీనా. ప్రవీణ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులు ప్రవీణ్ గురించి అడిగినప్పుడు ఆమె ఏమీ తెలియదన్నట్లు నటించింది. ఆరోజు రాత్రి అందరూ నిద్రలోకి జారుకున్న తర్వాత అర్ధరాత్రి 2:30 గంటలకు భర్త మృతదేహాన్ని ప్రియుడితో కలిసి బైక్ పై తీసుకెళ్లి 6కి.మీ దూరంలో ఉన్న దిన్నోడ్ కాలువ వద్ద పడేసింది. పోలీసులు కుళ్లిన స్థితిలో ప్రవీణ్ మృతదేహాన్ని కనుగొన్నారు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. ప్రవీణ్ ఇంటి సమీపంలో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. హెల్మెట్ ధరించిన అనుమానితుడికి చెందిన బైక్ ప్రవీణ్ ఇంటి సమీపంలో కనిపించింది. రవీనా కూడా బైక్ వెనుక కూర్చుని ముఖం మీద గుడ్డ కప్పుకుని ఉంది. ప్రవీణ్ మృతదేహం మధ్యలో ఉంది. అర్ధరాత్రి హెల్మెట్ ధరించి ఉన్న వ్యక్తి ప్రవీణ్ ఇంటికి తిరిగొచ్చాడు. అతడి బైక్‌పై ఓ మహిళ మాత్రమే ఉంది. మధ్యలో ఎవరూ లేరు. ఈ నేపథ్యంలో రవీనా, ఆమె లవర్ సురేశ్‌ను తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. తామిద్దరే ప్రవీణ్‌ను హత్య చేశామని పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు ఇద్దర్ని జైలుకు పంపారు.

# నిండు గర్భిణి ఉసురుతీసిన పైశాచిక భర్త

## తొలి నుంచీ వదిలించుకునే యత్నం

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలానికి చెందిన అనూష నగరంలోని ఒక కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది. ఆ సమయంలో స్నేహితుల ద్వారా జ్ఞానేశ్వర్ పరిచమయ్యాడు. స్నేహం కాస్త ప్రేమగా మారింది. వివాహానికి ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించారు. కానీ, జ్ఞానేశ్వర్ మాత్రం తమ కుటుంబ సభ్యుల అంగీకరించరని, పెళ్లి తరువాత చెబుదామని అనూషను ఒప్పించాడు. 2022 డిసెంబరు పదో తేదీన సింహాచలంలో అనూష కుటుంబ సభ్యులు, కొద్దిమంది స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వివాహమైన తరువాత ఎనిమిది నెలలపాటు ఇద్దరూ బాగానే ఉన్నారు. ఆ తరువాత నుంచి జ్ఞానేశ్వర్ అసలు రంగు బయటపడుతూ వచ్చింది. పెళ్లి జరిగిన సుమారు ఏడాదికి తనకు బ్లడ్ కేన్సర్ ఉందని అనూషకు చెప్పాడు. తాను ఎక్కువ కాలం జీవించనని, తనను విడిచి వెళ్లిపోవాలని, నీ జీవితం నాశనం కాకూడదని అన్నాడు. అలా వదిలి వెళ్లబోనని, ఉన్నంత కాలం నీతోనే ఉంటానంటూ అనూష చెప్పినా...అతడు తన ప్రయత్నాలను ఆపలేదు. రక్తపు వాంతులు చేసుకున్నట్టు, తీవ్రమైన నీరసంతో బాధపడుతున్నట్టు నమ్మించే ప్రయత్నం చేశాడు. వైద్యం కోసమంటూ అనూష వద్ద ఉన్న

డబ్బులు తీసుకున్నాడు. ఆ తరువాత అనారోగ్య సమస్యను పక్కనపెట్టి తన కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని, నిన్ను చంపేస్తారంటూ అనూషను భయపెట్టడం మొదలుపెట్టాడు. ఇప్పటికైనా నీదారి నువ్వు చూసుకోవాలంటూ అనూషను వదిలించుకునే ప్రయత్నం చేశాడు. కానీ, అనూష 'నాకు సర్వం నువ్వే. ప్రాణాలు పోయినా నిన్ను వదిలి వెళ్లను' అని చెప్పింది. ఈ క్రమంలోనే అనూష గర్భం దాల్చింది. కొద్దిరోజులు అనూషను బాగానే చూసుకున్నట్టు నటించాడు. నాలుగు రోజుల కిందట ఫలూదా తీసుకువచ్చి అనూషకు ఇచ్చాడు. తాగే క్రమంలో ఒక టాబ్లెట్ బయటకు రావడంతో ఒక్కసారిగా అనూష షాక్ తింది. టాబ్లెట్ ఉన్న విషయాన్ని జ్ఞానేశ్వర్‌కు చెప్పి షాపునకు వెళ్లి నిలదీద్దామన్నది. దానికి సరేనన్న జ్ఞానేశ్వర్ టాబ్లెట్ పక్కన పెట్టాలని సూచించి బయటకు వెళ్లిపోయాడు. ఇదే విషయాన్ని అనూష కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా చెప్పింది. అప్పుడు కూడా జ్ఞానేశ్వర్‌పై అనుమానం రాలేదు. ప్రసవానికి సమయం దగ్గరపడడంతో డాక్టర్ వద్దకు వెళ్లారు. ఆస్పత్రిలో చేరాలని వైద్యురాలు సూచించారు. అయితే, మర్నాడు అనూషను ఇంటికి తీసుకువెళ్లాడు. అదేరోజు ఉదయం అనూష అమ్మమ్మ తుమ్మలపల్లి అన్నవరం కాకినాడ నుంచి వచ్చారు. రాత్రి ఆస్పత్రి నుంచి వచ్చిన ఇద్దరికీ అన్నం పెట్టింది. ఇద్దరూ రూమ్‌లోకి వెళ్లారు. అనూష అమ్మమ్మ హాల్‌లో పడుకుంది. ఆరు గంటల సమయంలో వాళ్లున్న గదిలోకి అనూష అమ్మమ్మ వెళ్లింది. అప్పటికీ నిద్రలో ఉన్నట్టు కనిపించిన అనూషను తట్టి లేపే ప్రయత్నం చేసింది. ఎంతసేపటికీ లేవకపోవడంతో పక్కనే కుర్చీలో కూర్చుని సెల్‌ఫోన్ చూసుకుంటున్న జ్ఞానేశ్వర్‌తో అమ్మాయి లేవడం లేదు...చూడాలని చెప్పింది. ఏమీ తెలియనట్టు చెంపలపై కొడుతూ లే అనూష...అంటూ నాటకాలాడే ప్రయత్నం చేశాడు. అనూష లేవడం లేదని, ఏమైందో తెలియడం లేదంటూ అనూష అమ్మమ్మకు చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె ఎదురింటి వాళ్లను పిలిచింది. అనూష స్నేహితులకు జ్ఞానేశ్వర్ విషయాన్ని తెలియజేయడంతో వారంతా ఇంటికి చేరుకున్నారు. తొలుత దగ్గరలోని రెండు ఆస్పత్రులకు కారులో తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో కేర్‌కు తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు చనిపోయిందని నిర్ధారించారు. అనూష తనను విడిచి వెళ్లిపోయిందని, తాను ఎలా బతకాలంటూ జ్ఞానేశ్వర్ నాటకాన్ని రక్తికట్టించే ప్రయత్నం చేశాడు.

కేర్ నుంచి అనూషను ఇంటికి తీసుకువెళ్లిపోయేందుకు జ్ఞానేశ్వర్ ప్రయత్నించాడు. అయితే, జ్ఞానేశ్వర్ ముఖం, చేతిపై గాయాలు ఉండడాన్ని గుర్తించిన అనూష స్నేహితుడు ఆదర్శ్‌కు అనుమానం వచ్చింది. తన తల్లిని కేర్ ఆస్పత్రికి రమ్మని చెప్పాడు. ఆమె కేజీహెచ్‌లో పనిచేస్తున్నారు. మెడపై కొన్ని మచ్చలు ఉండడం, శరీరం పూర్తిగా నల్లగా మారిపోవడంతో

కేజీహెచ్‌కు తీసుకువెళదామని ఆమె చెప్పారు. దానికి జ్ఞానేశ్వర్ వద్దంటూ వారించే ప్రయత్నం చేశాడు. కానీ, అంతా తీసుకువెళ్లాల్సిందేనని పట్టుబట్టడంతో వారితోపాటు అంబులెన్స్‌లో ఎక్కి కేజీహెచ్‌కు వెళ్లాడు. అక్కడి వైద్యులు కూడా చనిపోయిందని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులతోపాటు స్నేహితులు గట్టిగా అడగడంతో తొలుత తానే చంపేశానని చెప్పాడు. ఆ తరువాత ఉరి వేసుకుందని చెప్పాడు. మళ్లీ గట్టిగా అడగడంతో తనకు ఇష్టం లేదని అందుకు చంపేసినట్టు అంగీకరించాడు. అమ్మాయికి పెళ్లి జరిగినప్పుడు తనకు ఆరోగ్యం బాలేదని, కోమాలో ఉన్నానని, ఇప్పుడు తన బిడ్డను పూర్తిగా దూరం చేశాడని ఆమె తల్లి పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. తన బిడ్డకు ప్రసవం సమయంలో తోడుగా ఉండాలని వచ్చానని, తాను ఇంట్లో ఉండగానే బిడ్డ ప్రాణాలు తీసేశాడని అనూష అమ్మమ్మ విలపించారు. అనూష కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చారు. వారి డిమాండ్ మేరకు అనూషను వారి స్వగ్రామమైన దువ్వాడ తీసుకువెళ్లి వారి కోడలిగా అంత్యక్రియలను నిర్వహించారు. పోయిన ప్రాణాన్ని తాము తీసుకురాలేకపోయినా వారి ఇంటి కోడలిగా గుర్తింపు తెచ్చుకోవాలని భావించిన అనూషకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించడం ద్వారా ఆత్మశాంతి కలిగించే ప్రయత్నం చేశామని అనూష మరిది స్వరూప్ తెలిపారు. ఇకపోతే, అనూష గర్భంలో ఆడ బిడ్డ ఉన్నట్టు పోస్టుమార్టం సమయంలో తేలింది.

# కుమార్తె కులాంతర వివాహం.. మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

### నల్లగొండ జిల్లా చిట్యాలలో ఘటన

### తండ్రిని కడసారి చూసేందుకూ రానన్న కుమార్తె

కుమార్తె కులాంతర ప్రేమ వివాహం చేసుకుందన్న మనస్తాపంతో ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్లగొండ జిల్లా చిట్యాలలో జరిగింది. డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న చిట్యాల వాసి రెముడాల గట్టయ్య (48) కుమార్తె.. అదే పట్టణవాసి ఓ దళిత యువకుడిని ప్రేమించి కుటుంబసభ్యులకు తెలియకుండా పెళ్లి చేసుకుంది. దీనిపై గట్టయ్య తన కుమార్తె అదృశ్యమైందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి కుమార్తె ప్రేమవివాహం చేసుకుని జిల్లా ఎస్పీ దగ్గర సరెండర్ అయిందని, తల్లిదండ్రులను కలవనని చెప్పిందని స్థానిక ఎస్ఐ అతడికి చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన గట్టయ్య ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో

ఆయన్ను కుటుంబసభ్యులు చికిత్స కోసం నార్కట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి.. తర్వాత పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ గట్టయ్య మృతి చెందాడు. గట్టయ్య మృతికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ అతడి బంధువులు చిట్యాల పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. అయితే, గట్టయ్య ఫిర్యాదు ఇచ్చిన వెంటనే విచారణ చేపట్టేలోపే.. అతని కుమార్తె తన తల్లిదండ్రులు, బంధువులతో ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరడంతోపాటు తల్లిదండ్రులను కలవనని స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు చిట్యాల ఎస్‌ఐ తెలిపారు. కాగా, గట్టయ్య ఆత్మహత్య వార్తను అతడి కుమార్తెకు ఫోన్‌లో చెప్పి చివరిచూపు కోసం రావాలని బంధువులు కోరుతున్నారన్నా రానని తెగేసి చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

# బిడ్డను చంపి తల్లిపై సామూహిక అత్యాచారం

హరియాణా జింద్‌లో అమానవీయ ఘటన జరిగింది. ఐదేళ్ల చిన్నారిని హత్య చేసి తల్లిపై దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డారు నలుగురు దుండగులు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నలుగురు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. జింద్ మురికి వాడలో నివసించే బాధిత కుటుంబం, చెత్తను సేకరిస్తూ జీవిస్తుంది. అయితే 15 రోజుల క్రితం బాధితురాలి భర్తకు పక్కనే ఉండే అమిత్ అనే వ్యక్తితో పాటు అతడి స్నేహితులతో గొడవ జరిగింది. ఈ క్రమంలోనే ఆమె భర్త తలకు తీవ్ర గాయం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఇరు పక్షాలను పిలిపించిన పోలీసులు మాట్లాడటంతో వివాదం సద్దుమణిగింది. కానీ అప్పటి నుంచి అమిత్‌తో పాటు అతడి స్నేహితులు బాధితురాలి కుటుంబంపై కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరోజు గుడిసెలో భర్త లేని సమయం చూసి స్నేహితులతో కలిసి అమిత్ వచ్చాడు. ముగ్గురు పిల్లలతో కలిసి గుడిసెలో నిద్రపోతున్న బాధితురాలపై దాడి చేశారు. అనంతరం ఆమెతో పాటు ఐదేళ్ల చిన్నారిని పక్కనే ఉన్న చెత్త కుప్ప వద్దకు ఎత్తుకెళ్లారు. అక్కడ చిన్నారి గొంతు నులిమి హత్య చేసి, అనంతరం బాధితురాలిపై నలుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.

తర్వాత అపస్మారక స్థితిలో ఉన్న మహిళను అక్కడే వదిలేసి పారిపోయారు. చిన్నారి మృతదేహం రాత్రంతా ఆ చెత్తకుప్పలనే ఉంది. ఉదయం బయటకు వచ్చిన మహిళలు, బాధితురాలిని గమనించారు. వెంటనే ఆమెను అక్కడి నుంచి గుడిసెకు తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు మరణించిన చిన్నారికి అంత్యక్రియలు చేశారు కుటుంబ సభ్యులు. ఈ క్రమంలోనే  స్పృహలోకి వచ్చిన మహిళ జరిగిన విషయాన్ని వెల్లడించింది. ఈ

సమాచారం అందుకున్న పోలీసులు చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్‌మార్టమ్ పరీక్షకు తరలించారు. అత్యాచారం, హత్య సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల్లో ముగ్గురు మైనర్లని ఎస్ఐ యశ్‌వీర్ తెలిపారు. చిన్నారిపైనా అత్యాచారం చేసినట్లు అనుమానిస్తున్నామని, పోస్ట్ మార్టమ్ పరీక్ష ఫలితాలు వచ్చిన తర్వాతే నిర్ధరిస్తామని చెప్పారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని వివరించారు.

# 135 రోజుల తర్వాత మహిళ మృతదేహం ఆచూకీ..

రోడ్డు పక్కన ఓ మృతదేహాన్ని పూడ్చి పెట్టారని తెలియటంతో జనం పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. అక్కడ నిజంగా శవం ఉందా? లేదా? అన్నది అందరికీ ఓ అంతుచిక్కని విషయం. ఓ పెద్ద జేసీబీ అక్కడికి వచ్చింది. రోడ్డు పక్కన ఉన్న భూమిని తవ్వటం మొదలెట్టింది. కొద్దిసేపటి తర్వాత అందరూ షాక్ అయ్యేలా.. నిజంగానే అక్కడ శవం బయటపడింది. పూడ్చి పెట్టిన 135 రోజుల తర్వాత శవం బయటకు వచ్చింది. ఈ సంఘటన ఆ గ్రామంలోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఉత్తర ప్రదేశ్, మావు జిల్లాలోని పట్టి మహ్మద్‌పూర్ గ్రామానికి చెందిన ఆయు అనే వ్యక్తికి నజియా ఖాతూన్‌తో కొన్నేళ్ల క్రితం పెళ్లయింది. ఏమైందో ఏమో తెలియదు కానీ, నజియా ఖాతూన్‌ను అత్తింటి వారు చంపేశారు. తర్వాత ఆ శవాన్ని ఎవరికీ తెలియకుండా ఖాజీపురలో రోడ్డు ప్రక్కన పూడ్చి పెట్టారు. ఆయు.. నజియా ఖాతూన్ చెల్లెలిపై అత్యాచారం కూడా చేశాడు. నవంబర్ 30వ తేదీన నజియా చెల్లెలు అక్క హత్య, తన రేపు గురించి కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులకు కూడా చెప్పింది. అయినా ఎవరూ పట్టించుకోలేదు.

ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 11వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, పోలీసులు మర్డర్ సెక్షన్లు తీసేసి విచారణ చేయటం మొదలెట్టారు. దీంతో బాధితురాలు కోర్టుకు వెళ్లింది. కోర్టులో పిటిషన్ వేసింది. ఏప్రిల్ 13వ తేదీన కోర్టు పూడ్చిపెట్టిన శవాన్ని బయటకు తీయాలని ఆదేశాలు జారీ చేసింది. మండల అధికారులు, పోలీసులు జేసీబీ సాయంతో శవాన్ని బయటకు తీశారు. నజియాను పూడ్చి పెట్టిన దాదాపు 135 రోజుల తర్వాత శవం బయటపడింది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టును బట్టి తదుపరి విచారణ జరగనుంది.

# చిత్తూరులో పరువు హత్య

చిత్తూరు బాలాజీనగర్ కాలనీలో నివాసముంటున్న ముంతాజ్, షౌకత్అలీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు.చిన్న కూతురు యాస్మిన్ (26) ఎంబీఏ పూర్తి చేసింది. కాలేజీలో ప్రేమించిన పూతలపట్టు మండలం పోటుకనుమకు చెందిన సాయితేజ్‌ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయం ఇంట్లో తెలిసి తల్లిదండ్రులు యాస్మిన్‌కు పెళ్లి నిశ్చయించారు. పెళ్లికి మూడు రోజులు ముందు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యాస్మిన్ ఫిబ్రవరి 9వ తేదీన నెల్లూరులో సాయితేజ్‌ను పెళ్లి చేసుకుంది. ప్రాణహాని ఉందని గుర్తించిన యాస్మిన్, సాయితేజ్ తిరుపతి పోలీసులను ఆశ్రయించారు. ఇరు కుటుంబాల వారిని పోలీసులు పిలిపించి సర్ది చెప్పి పంపించారు. అప్పటి నుంచి రెండు నెలల వరకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వీరి సంసారం సాగింది. యాస్మిన్ పెళ్లితో కుటుంబ పరువు పోయిందని భావించిన షౌకత్అలీ కుటుంబ సభ్యులు ఆమెపై కక్ష పెంచుకున్నారు. పూర్తిగా విచక్షణ కోల్పోయి ఆమె ప్రాణం తీసేందుకు ప్లాన్ చేశారు. షౌకత్అలీకి ఆరోగ్యం బాలేదంటూ ఫోన్లు చేసి యాస్మిన్‌ను ఇంటికి పిలిపించారు. ఆమె భర్త సాయితేజ్ చిత్తూరు గాంధీసర్కిల్లో వదిలిపెట్టగా ఆమె పెద్దమ్మ కుమారుడు లాలూ సాహెబ్ యాస్మిన్‌ను ఇంటికి తీసుకెళ్లాడు.

వచ్చిన 20 నిమిషాల్లోపే ముందుగా అనుకున్న పథకం ప్రకారం యాస్మిన్‌ను గొంతు నులిమి చంపేశారు. భార్యకోసం షౌకత్అలీ ఇంటికి వచ్చిన సాయితేజ్‌కు ఆమె ఉరేసుకుని చనిపోయిందని నమ్మించారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీలో శవముందని చెప్పడంతో సాయితేజ్ అక్కడికెళ్లాడు. పోస్టుమార్టం సందర్భంగా యాస్మిన్ మెడ కింద గాయాన్ని వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక శవాన్ని అప్పగించడంతో సాయితేజ్ సొంతూరుకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. యాస్మిన్ మృతి కేసులో తండ్రి, ఇద్దరు సోదరులు పరారయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆ కుటుంబ దగ్గరి బంధువును అదుపులోకి తీసుకున్నారు. యాస్మిన్ మృతి విషయంలో ఏం జరిగిందని, నిందితులు ఎక్కడున్నారని విచారిస్తున్నారు. యాస్మిన్‌ను చంపాలని ముందే ప్లాన్ చేసుకుని పిలిపించినట్లు పోలీసుల అదుపులోని వ్యక్తి అంగీకరించినట్లు తెలుస్తోంది. చంపింది నిజమే కానీ, ఎలా చంపారనేది పోలీసులు ఇంకా నిర్ధారణకు రావడం లేదు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులు దొరికితేనే విషయం తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు.

# తీవ్ర లైంగిక వేధింపుల బాధితురాలు వర్జీనియా గియుఫ్రే ఆత్మహత్య

తీవ్ర లైంగిక వేధింపులకు గురైన వర్జీనియా గియు ఫ్రే ఆత్మహత్య చేసుకొంది. ఆస్ట్రేలియాలోని తన వ్యవసాయ భూమిలో ఈ ఘటనకు ఆమె పాల్పడినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. అమెరికా ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్, బ్రిటన్ యువరాజు ఆండ్రూపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన వర్జీనియా గియుఫ్రే (41) ఆత్మహత్య చేసుకొంది. ఆస్ట్రేలియాలోని తన పొలంలో ఈ ఆత్మహత్యకు గియుఫ్రే పాల్పడిందని ఆమె కుటుంబం సభ్యులు వెల్లడించారు. లైంగిక వేధింపులతోపాటు లైంగిక అక్రమ రవాణాకు జీవితాంతం బాధితురాలిగా ఉన్న ఆమె.. చివరకు ఆత్మహత్య చేసుకొందని తెలిపారు. లైంగిక వేధింపులు, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా గియుఫ్రే బలమైన గొంతుకను వినిపించారని వారు గుర్తు చేసుకొన్నారు. మరి ముఖ్యంగా ఎప్‌స్టీన్‌తోపాటు అతడి అనుచరులకు వ్యతిరేకంగా మాట్లాడారని చెప్పారు. ఇది ఎప్‌స్టీన్ బాధితులకు కొండంత ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. లైంగిక వేధింపులు, లైంగిక అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో గియుఫ్రే ఒక యోధురాలని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు.. ఆమెను అభివర్ణించారు. ఇక ఎప్‌స్టీన్ సహచరుడు గిస్లైన్ మాక్స్వెల్ దోషిగా నిర్ధారించేందుకు పోలీసులకు సమాచారం అందించడంలో గియుఫ్రే కీలక పాత్ర పోషించారు. అలాగే న్యూయార్క్‌లోని సదరన్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన న్యాయ పోరాటంలో.. యూఎస్ అటర్నీ పలుమార్లు జరిపిన విచారణకు సైతం ఆమె తన సహాయ, సహకారాలు అందించింది.

## న్యాయం కోసం పోరాటం

న్యాయం కోసం గియుఫ్రే చిన్ననాటి నుంచి దుర్భరమైన జీవితాన్ని గడిపింది. ఫ్లోరిడాలో పెరిగిన ఆమె.. ఫ్యామిలీ ఫ్రెండ్ చేతిలో లైంగిక వేధింపులకు గురైంది. చివరకు ఆమె వీధుల్లో నివసించేలా చేసింది. ఇక యుక్త వయసులో ఆమె మాక్స్‌వెల్‌ను కలిసింది. అతను 1999 నుంచి 2002 మధ్య ఎప్‌స్టీన్ చేత లైంగిక వేధింపులకు గురిచేయబడ్డానని ఆరోపించింది. ఎప్‌స్టీన్ తనను ప్రిన్స్ ఆండ్రు, మోడలింగ్ ఏజెంట్ జీన్-లూక్ బ్రూనెల్ వంటి శక్తివంతమైన వ్యక్తులకు అక్రమ రవాణా చేశాడని గియుఫ్రే ఆరోపించిన విషయం విదితమే. లైంగిక అక్రమ రవాణా కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న ఫైనాన్షియర్ ఎప్‌స్టీన్.. విచారణను ఎదుర్కొంటూ 2019లో ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే ఎప్‌స్టీన్ కోసం

మైనర్ బాలికలను నియమించడంలో 2021లో దోషిగా తేలిన మాక్స్‌వెల్‌కు సైతం జైలు శిక్ష ఖరారైంది. అయితే గియుఫ్రే 2021లో ప్రిన్స్ ఆండ్రూపై దావా వేసింది. ఆమె తన 17 ఏళ్ల వయసులో తనను లైంగిక వేధింపులకు గురి చేశాడంటూ అందులో ఆరోపించింది. ఈ ఆరోపణలను ఆండ్రూ తిరస్కరించాడు. కానీ ఈ కేసు చివరకు పరిష్కారమైంది. మరోవైపు 2021లో గియుఫ్రే ఫ్రాన్స్‌లోని కోర్టులో బ్రూనెల్‌కు వ్యతిరేకంగా ధైర్యంగా సాక్ష్యం చెప్పింది. తనతోపాటు ఇతర బాధితులకు న్యాయం చేయాలంటూ కోర్టును ఆమెను కోరింది. ఇక ఎప్‌స్టీన్ అరెస్టుకు ముందు గియుఫ్రే తన భర్త, పిల్లలతో కలిసి ఆస్ట్రేలియాకు వెళ్లింది.

# మనిషి కాదు మృగం.. 11 ఏళ్ల బాలికను అత్యంత దారుణంగా..

చిన్న పిల్లల దగ్గరినుంచి ముసలివాళ్ల దగ్గరి వరకు కామాంధులు ఎవరినీ వదలటం లేదు. తాజాగా, ఓ 24 ఏళ్ల వ్యక్తి 11 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మూగ, చెవిటి అయిన ఆ బాలికపై అత్యాచారం చేయటమే కాకుండా.. దారుణంగా కొట్టి హింసించాడు. పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై తుపాకితో కాల్పులు జరిపాడు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితురాలి కుటుంబం చెప్పిన వివరాల మేరకు.. ఉత్తర ప్రదేశ్, రామ్‌పూర్ జిల్లాకు చెందిన 11 ఏళ్ల బాలిక చెవిటి, మూగ సమస్యతో బాధపడుతూ ఉంది. సాయంత్రం నుంచి ఆ బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు బాలికకోసం వెతుకుతూ ఉన్నారు. మర్నాడు ఉదయమే బాలిక పొలాల్లో నగ్నంగా పడిపోయి కనిపించింది. పాప శరీరంపై గాయాలు కూడా ఉన్నాయి. కుటుంబసభ్యులు వెంటనే బాలికను ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అక్కడి డాక్టర్లు.. మెరుగైన వైద్యం కోసం మీరట్ తీసుకెళ్లమని సలహా ఇచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించి చూశారు. అదే గ్రామానికి చెందిన డాన్ సింగ్ అనే 24 ఏళ్ల యువకుడిపై అనుమానం మొదలైంది. అతడ్ని పట్టుకోవడానికి ప్రయత్నించగా.. తుపాకితో పోలీసులపై కాల్పులు జరిపాడు. ఈ నేపథ్యంలోనే పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపారు. డాన్ సింగ్ తొడలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. అతడు పోలీసులకు దొరికిపోయాడు. అతడ్ని ఆస్పత్రికి తరలించారు. చికిత్స తర్వాత స్టేషన్ తీసుకెళ్లనున్నారు. ఇక, బాలిక పరిస్థితిపై డాక్టర్ అంజు సింగ్ మాట్లాడుతూ.. 'ఒకరు లేదా అంతకంటే ఎక్కువమంది ఆమెపై అత్యాచారం చేశారు. పదునైన ఆయుధంతో ఆమె ముఖంపై కొట్టారు. దారుణంగా హింసించారు. ఏం జరిగిందో

బాలిక చెప్పలేకపోతోంది' అని అన్నారు.

# బాలిక కిడ్నాప్, హత్య.. ఎన్‌కౌంటర్‌లో నిందితుడు హతం

కర్ణాటకలోని హుబ్బళిలో ఐదేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి.. ఆపై హత్య చేసిన వ్యక్తి ఎన్‌కౌంటర్‌లో మరణించాడని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ పోలీస్ సైతం గాయపడ్డారని చెప్పారు. బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని పోలీసులు చుట్టు ముట్టి లొంగిపోవాలని సూచించారని తెలిపారు. కానీ అతడు పోలీసుల సూచనలను లక్ష్య పెట్టలేదన్నారు. అంతేకాకుండా.. పోలీసులపై అతడు దాడికి తెగబడ్డాడని.. దీంతో తమ కాల్పుల్లో అతడు మరణించాడని పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు. హుబ్బళిలో ఐదేళ్ల చిన్నారని బిహార్ రాజధాని పాట్నాకు చెందిన నితీష్ కుమార్ అనే యువకుడు కిడ్నాప్ చేశాడు. అనంతరం ఆ పాపను షెడ్‌లోని తీసుకు వెళ్లి అత్యాచారానికి యత్నించారు. ఇంతలో ఆ బాలిక బిగ్గరగా కేకలు వేసింది. దీంతో స్థానికులు వెంటనే స్పందించి.. షెడ్ వద్దకు చేరుకున్నారు. ఈ విషయాన్ని గమనించి నితీష్ కుమార్.. ఆ బాలికను హత్య చేసి అక్కడి నుంచి పరారైయ్యాడు. దీంతో స్థానిలంతా కలిసి భారీగా అశోక్ నగర్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఈ హత్యకు పాల్పడిన నితీష్ కుమార్‌ను తమకు అప్పగించాలని.. అతడిని ప్రజా కోర్టులో శిక్షిస్తామని పోలీసులను డిమాండ్ చేశారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

స్థానిక సీసీ ఫుటేజ్ ఆధారంగా బిహార్ రాజధాని పాట్నాకు చెందిన నితీష్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు. అనంతరం అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ క్రమంలో అతడిని పట్టుకొనేందుకు వారు యత్నించారు. అందులోభాగంగా అతడిని చుట్టుముట్టారు. లొంగిపోవాలని అతడిని పోలీసులు సూచించారు. కానీ వారిపైనే అతడు దాడికి యత్నించడంతో.. ప్రాణ రక్షణ కోసం అతడిపై పోలీసులు కాల్పులు జరిపారు. దీంతో నితీష్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. ఇంకోవైపు ఐదేళ్ల చిన్నారి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే బాలికపై అత్యాచారం జరిగినట్లు వారు ఎటువంటి ప్రకటన చేయలేదు. వైద్య నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జైల్లో ఉరేసుకున్న మైనర్ బాలిక హత్యాచార నిందితుడు

మహారాష్ట్రలోని థానే జిల్లా కల్యాణ్‌లో 2024 డిసెంబర్‌లో మైనర్ బాలికపై హత్యాచారం ఘటన సంచలన సృష్టించింది. ఈ ఘటనలో నిందితుడైన విశాల్ గావ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. నవీ ముంబైలోని తలోజా సెంట్రల్ జైలులో ఉన్న విశాల్ గావ్లి తెల్లవారు జామున 3.30 గంటలకు జైలు టాయిలెట్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ముంబైలోని జేజే ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనను ఖర్ఘర్ పోలీసు స్టేషన్ అధికారి ఒకరు ధ్రువీకరించారు. జైలు టాయిలెట్‌లో టవల్‌తో ఊరేసుకుని నిందితుడు చనిపోవడాన్ని జైలు అధికారులు గుర్తించినట్టు చెప్పారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే పంచనామా నిర్వహించారు. మృతికి కారణాలపై నిర్ధారించేందుకు పోస్ట్‌మార్టం కోసం జేజీ ఆసుపత్రికి తరలించినట్టు అధికారులు వివరించారు. థానే జిల్లా కల్యాణ్‌లో 12 ఏళ్ల మైనర్ బాలికను కిడ్నాప్ చేసి హత్యాచారానికి పాల్పడిన ఘటన అప్పట్లో సంచలనమైంది. కోల్సేవాడి ప్రాంతం నుంచి మాయమైన బాలిక ఆ తర్వాత బాప్‌గావ్ గ్రామంలో మృతదేహమై కనిపించింది. నిందితులకు కఠిన శిక్ష విధించాలంటూ డిమాండ్లు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరిపిన పోలీసులు 35 ఏళ్ల గావ్లి, అతని భార్య సాక్షిని అరెస్టు చేశారు. సొమ్ముల కోసం కిడ్నాప్ చేసి, అత్యాచారం, హత్యకు పాల్పడ్డారని, సాక్ష్యాలను మాయం చేశారని ఆరోపిస్తూ భారతీయ న్యాయ సంహిత, పోక్సో చట్టం కింద వారిపై కేసులు పెట్టారు. నిందితుల జంటపై 948 పేజీల ఛార్జిషీటును కల్యాణ్ పోలీసులు నమోదుచేశారు. బాలికపై విశాల్ గావ్లి అత్యాచారం జరిపి హత్య చేశాడని, బాలిక మృతదేహాన్ని బాప్‌గావ్‌లో పడేయడానికి సాక్షి సహకరించిందని పోలీసులు తెలిపారు.

# మాయమాటలతో నమ్మించి.. ఆపై మద్యం తాగించి..

అమాయకురాలైన మహిళను మంచి మాటలతో నమ్మించి.. మాట్లాడాలని

పిలిపించారు. ఆ తర్వాత మహిళ చేత బలవంతంగా మద్యం తాగించి.. అత్యంత కిరాతకంగా ఆమెని హత్య చేశారు. ఈ సంఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటు చేసుకుంది. అంజలి అనే 25 సంవత్సరాల యువతి ఐదు రోజుల క్రితం మిస్సైంది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో  ఆమె మృతదేహం లభ్యం కావడంతో తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు.  ఓ ప్రాపర్టీ డీలర్, అతడి భాగస్వామి ఇద్దరు కలిసి అంజలిని అత్యంత దారుణంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక ప్రాపర్టీ లావాదేవీకి సంబంధించి.. మృతురాలు అంజలికి.. ప్రాపర్టీ డీలర్ శివేంద్ర యాదవ్ (26), అతడి భాగస్వామి గౌరవ్ (19) తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో నిందితులు ల్యాండ్ కోసం అంజలి దగ్గర నుంచి 6 లక్షల రూపాయలు తీసుకున్నారు. అందుకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఇస్తామని చెప్పి.. ఐదు రోజుల క్రితం అంజలిని పిలిపించారు. వారి మాటలు నమ్మిన అంజలి నిందితులు చెప్పిన దగ్గరకు వెళ్లింది. ఈ క్రమంలో నిందితులు అంజలిని మాటల్లో పెట్టి ఆమెతో మద్యం తాగించారు. ఆ తర్వాత కత్తితో అత్యంత దారుణంగా హత్య చేశారు. అక్కడితో ఆగక.. శివేంద్ర యాదవ్ తన భార్య, తండ్రికి వీడియో కాల్ చేసి అంజలి మృతదేహాన్ని చూపించాడు. ఆ తర్వాత అంజలి డెడ్ బాడీని కాల్చారు. అనంతరం సగం కాలిన మృతదేహాన్ని నదిలో పడేశారు. ఆమె స్కూటీని కూడా తగులబెట్టారు. ఇక శివేంద్ర కాల్ చేసిన రోజు బయటకు వెళ్లిన అంజలి ఆ తర్వాత తిరిగి ఇంటికి రాలేదు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అంజలి కాలిపోయిన స్కూటీని గుర్తించారు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఐదు రోజుల తర్వాత సగం కాలిపోయి కుళ్లిన స్థితిలో ఉన్న అంజలి డెడ్ బాడీని గుర్తించారు పోలీసులు. దీని గురించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు శివేంద్ర యాదవ్, అతడి భాగస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# పోక్సో కేసులో నలుగురి అరెస్టు

బాలికను ప్రేమ పేరిట ఉచ్చులో దింపిన యువకుడితో పాటు మరో ముగ్గురిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు వెల్లడించారు. రేగిడి మండలం మునకలవలసకు చెందిన కరణం జగదీశ్ ఇదే మండలం ఒక గ్రా మానికి చెందిన బాలికతో కొద్దిరోజులుగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. బాలిక తల్లిదండ్రులు పెళ్లిసంబంధాలు చూస్తున్నారు. దీన్ని పసిగట్టిన సదరు యువకుడు బాలికను స్నేహితులతో కలిసి ఊరు దాటించేందుకు పథకం వేశాడు. అందులో భాగంగా మార్చి 26న జడదీశ్ చిన్నశిర్లాం గ్రామానికి చెందిన

గొట్టాపు దుర్గాప్రసాద్ సహకారం కోరాడు. బాలిక మెడలో చైన్‌ను తాకట్టు పెట్టి వారికి కొంత నగదును ఇచ్చాడు. విజయవాడ రాణితోటలోని మరో ఇద్దరు స్నేహితులు యడ్లగీత, దేవరకొండ బాలు వద్దకు ట్రైన్ టికెట్లు సమ కూర్చి అదేరోజు విజయవాడకు దుర్గాప్రసాద్ పంపించాడు. అక్కడ వారు ఉండేం దుకు రూమ్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు కుమార్తె అదృశ్య మైందని మార్చి 28న రేగిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసుల విచారణలో అసలు సంగతి బహిర్గతమైంది. బాలికను ప్రేమ పేరిట వంచించాడని గుర్తించి జగదీశ్‌తో పాటు దుర్గాప్రసాద్, యడ్ల గీత, దేవరకొండ బాలును అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర, ఎస్ఐ నీలావతి ఉన్నారు.

# వైద్య పరీక్షల కోసం 7 కి.మీ నడిచిన గర్భిణి.. వడదెబ్బతో మృతి

మహారాష్ట్ర పాల్ఘర్‌లో హృదయవిదారక ఘటన జరిగింది. వడదెబ్బకు ఓ నిండు గర్భిణీ బలైంది. ఆరోగ్య పరీక్షల కోసం పీహెచ్‌సీకి నడిచి వెళ్లిన ఓ గర్భిణీ.. వడదెబ్బ వల్ల మృతి చెందింది. పాల్ఘర్‌లోని ఓసర్ వీరా గ్రామానికి చెందిన సోనాలి వాఘాట్ (21) అనే గర్భిణీ జనరల్ చెకప్ కోసం దండల్వాడి పీహెచ్‌సీకి బయలుదేరింది. ఆమె గ్రామం నుంచి 3.5 కిలోమీటర్లు నడిచి హైవేకు చేరుకుంది. అక్కడి నుంచి ఆమె ఆటోలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. అక్కడ వైద్య సేవలు అనంతరం తిరిగి ఇంటికి బయలుదేరింది. అయితే అప్పటికే ఎండలు భగభగమంటున్నాయి. తిరిగి ఆటోలో బయలుదేరి హైవేపై దిగి కాలి నడకన స్వగ్రామానికి బయలుదేరింది. ఎలాగోలా మెల్లగా నడుచుకుంటూ ఇంటికి చేరుకుంది. అయితే సోనాలి వడదెబ్బ వల్ల తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమె కుటుంబ సభ్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వారు అక్కడ సోనాలికి ప్రథమ చికిత్స చేసి.. మెరుగైన వైద్యం కోసం సబ్ డివిజనల్ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. సోనాలిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించింది. ఆమె కడుపులో ఉన్న గర్భస్థ శిశువు కూడా ప్రాణాలు కోల్పోయింది. 'సెమీ-కోమోర్బిడ్ కండిషన్ కారణంగా సోనాలి మరణించింది. ఆమె వడదెబ్బకు గురైంది. అందువల్ల ఆమెతో పాటు, ఆమె గర్భంలో ఉన్న గర్భస్థ శిశువు సైతం మరణించింది. తీవ్రమైన ఎండలో 7 కి.మీ నడవడం వల్ల ఆమె వడదెబ్బకు గురైంది. బాధితురాలికి రక్త హీనత వ్యాధి ఉంది' అని వైద్యులు వెల్లడించారు.

# 17 ఏళ్ల బాలుడి పైశాచికానందం

తిట్టిందని వృద్ధురాలిపై పగ.. దారుణంగా చంపి వీడియో తీసిన వైనం

బెంగళూరులో వీడియో వైరల్... పోలీసుల అప్రమత్తం

హైదరాబాద్ పోలీసులకు సమాచారమివ్వడంతో ఘోరం వెలుగులోకి

ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని ఓ పదిహేడేళ్ల బాలుడు చీరతో ఉరి బిగించి చంపేశాడు. చనిపోయిందని నిర్ధారించుకున్నాక ముఖంపై, మెడపై తన్నుతూ.. మృతదేహంపై గెంతులేశాడు. తన ఈ దుశ్చేష్టనంతా వీడియో తీసి.. బెంగళూరులో ఉన్న తన స్నేహితులకు షేర్ చేశాడు. ఈ మేరకు కుషాయిగూడ కృష్ణానగర్ కాలనీలో వృద్ధురాలు కమలమ్మ (70) దారుణ హత్యకు గురైన ఘటనలో తాజాగా వెలుగుచూసిన ఘోరమిది. స్థానికుల వివరాల ప్రకారం.. కృష్ణానగర్‌లో కమలమ్మ ఒంటరిగా భవనంలో నివాసం ఉంటోంది. ఆమెకు ఎవ్వరూ లేరు. ఆ భవనంలోని రెండు షెటర్లను విద్యుత్ ఉపకరణాల దుకాణం కోసం కొన్నేళ్ల క్రితం రాజస్థాన్‌కు చెందిన ప్రకాశ్ చౌదరి, లలిత్ చౌదరికి ఆమె అద్దెకిచ్చింది. ఆ షాపులో రాజస్థాన్‌కే చెందిన 17 ఏళ్ల బాలుడు గత ఎనిమిది నెలలుగా పనిచేస్తున్నాడు. ఆ దుకాణం నిర్వహణ విషయంలో కమలమ్మ తరచూ ఆ బాలుడిని మందలిస్తోంది. అతడి తీరుపై చిర్రుబుర్రులాడుతోంది. అతడు కనిపించినప్పుడల్లా కసురుకుంటోంది.

వృద్ధురాలి తీరుతో ఆమెపై కక్ష పెంచుకున్న బాలుడు, రాత్రి వేళ ఇంట్లోకి చొరబడి కమలమ్మ మెడకు చీరతో బిగించి చంపేశాడు. అప్పటికీ కోపం చల్లారని బాలుడు, మృతదేహంపై ఎగిరి దుంకుతూ.. మెడపై తొక్కుతూ నృత్యం చేశాడు. దీన్నంతా వీడియోగా చిత్రీకరించి.. ఇదిగో చూడండంటూ బెంగళూరులోని స్నేహితులకు వాట్సాప్‌లో పంపాడు. అక్కడ ఆ వీడియో వైరల్‌గా మారడంతో బెంగళూరు పోలీసులు ఆరా తీశారు. హైదరాబాద్‌లో ఈ దారుణం జరిగినట్లు గుర్తించి రాచకొండ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు రంగంలోకి దిగడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుళ్లిన స్థితిలో వృద్ధురాలి మృతదేహాన్ని కనుగొంటే.. తాజాగా 17 ఏళ్ల బాలుడు ఘోరానికి పాల్పడ్డ వీడియో బయటపడింది. కమలమ్మ ఒంటరి మహిళ కావడం, సంతానం లేకపోవడంతో ఆస్థికోసం ఎవరైనా ఈ దారుణాన్ని చేయించారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# స్కూల్లో విద్యార్థినికి 'నెలసరి' వివక్ష

## విడిగా కూర్చోబెట్టిన వైనం.. తమిళనాడులో దారుణం

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే బడిలో కూడా 'నెలసరి'ని పాపంగా చూడటం.. విద్యార్థినులను ఇబ్బంది పెడుతున్నారంటే.. ఎలాంటి సమాజంలో బతుకుతున్నామో అర్థం చేసుకోవచ్చు. తాజాగా ఇలాంటి అమానుష ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. పీరియడ్స్ వచ్చిన విద్యార్థినిని క్లాస్ రూమ్ బయట కూర్చోపెట్టి పరీక్ష రాయించింది ఓ స్కూల్ యాజమాన్యం. ఈ అమానుష సంఘటన తమిళనాడు, కోయంబత్తురులోని సెంగుట్టై ప్రాంతంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో వెలుగు చూసింది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థినికి స్కూల్‌కి వచ్చాక పీరియడ్స్ వచ్చాయి. దాని గురించి ప్రిన్సిపాల్‌కి చెప్పింది. విషయం తెలుసుకుని స్టూడెంట్‌కి మద్దతుగా ఉండాల్సిన ప్రిన్సిపాల్ కాస్త.. అమానుషంగా వ్యవహరించింది. పీరియడ్స్ రావడం మహా పాపం అన్నట్లుగా భావించి.. విద్యార్థినిని క్లాస్ రూమ్ బయట కూర్చొబెట్టింది. అక్కడే కూర్చోని పరీక్ష రాయాల్సిందిగా ఆదేశించింది. క్లాస్ పిల్లలందరి ముందు ప్రిన్సిపాల్ ఇలా చేయడంతో ఆ విద్యార్థిని తీవ్రంగా మనస్తాపం చెందింది. బాధపడుతూనే క్లాస్ రూమ్ బయటకు వెళ్లి కూర్చొని.. అక్కడే పరీక్ష రాసింది. ఇంతలో విద్యార్థిని తల్లి స్కూల్‌కి వచ్చింది. కుమార్తె క్లాస్ బయట ఉండటం చూసి.. ఏమైందని ప్రశ్నించింది. అప్పుడా విద్యార్థిని.. జరిగిన దాని గురించి తన తల్లికి చెప్పింది. తన బిడ్డ పట్ల ఇంత అమానుషంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది ఆ తల్లి. స్కూల్లో ఇంత అరాచకంగా ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించింది. ఇక విషయం తెలుసుకున్న బాలిక తండ్రి.. దీనిపై మహిళా సంక్షేమ శాఖ, రాష్ట్ర మహిళా కమిషన్‌కి ఫిర్యాదు చేశాడు. పీరియడ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన స్కూల్‌లోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవటం దారుణం కాక మరేమిటి?

# చాటింగ్ వద్దన్నాడని... భర్తపై హత్యాయత్నం

ఓ మహిళ తన భర్తను కత్తితో పొడిచి చంపడానికి ప్రయత్నించింది. అతడు ఇచ్చిన సలహా నచ్చకపోవటంతో ఆమె ఈ దారుణానికి ఒడిగట్టింది. ఈ సంఘటన కర్ణాటకలోని విజయపుర సిటీలో  చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. అజిత్ రాథోడ్, తేజు రాథోడ్ భార్యాభర్తలు. వీరు విజయపుర, జావా నగర్‌లోని ఓ ఇంట్లో ఉంటున్నారు. తేజు తరచుగా వేరే మగాళ్లతో చాటింగ్ చేస్తూ ఉండేది. అది కూడా గంటలు,

గంటలు చాటింగ్ చేస్తూ ఉండేది. తేజు వ్యవహార శైలి అజిత్‌కు నచ్చలేదు. పద్ధతి మార్చుకోవాలని, ఇతర వ్యక్తులతో చాటింగ్ చేయటం మంచిది కాదని సలహా ఇచ్చాడు. ఇది తేజుకు నచ్చలేదు. భర్తపై పగ పెంచుకుంది. ఎలాగైనా భర్తను చంపాలనుకుంది. ఒక రోజు తెల్లవారుజామున కత్తితో అతడి మెడపై పొడిచింది. దీంతో అతడు గట్టిగా కేకలు పెట్టాడు. ఆ కేకలు విన్న కుటుంబసభ్యులు అక్కడికి వచ్చారు. వెంటనే అతడ్ని బీఎల్‌డీఈ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతడికి చికిత్స చేశారు. ప్రస్తుతం అజిత్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. ఇక, ఈ సంఘటన గురించి పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితురాలు తేజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తేజు తన భర్తను చాటింగ్ చేయొద్దన్నందుకే చంపాలనుకుందా? లేక వేరే కారణం ఉందా అన్న కోణంలో కూడా పోలీసులు విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో అసలు విషయాలు బయటపడే అవకాశం ఉంది. తేజు, అజిత్‌ల ఘటనతో స్థానికంగా కలకలం చెలరేగింది.

# క్యాన్సర్‌తో పోరాడుతున్న బాలికపై యువకుడి అత్యాచారం

మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్ ఈస్ట్ ఏరియాలో దారుణం జరిగింది. క్యాన్సర్‌తో పోరాడుతున్న 13 ఏళ్ల బాలికపై 29 ఏళ్ల యువకుడు అత్యాచారానికి తెగబడ్డాడు. దీంతో బాధిత బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక కుటుంబం ఫిర్యాదు మేరకు నిందితుడు సూరజ్ సింగ్‌పై బద్లాపూర్ ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ప్రత్యేక టీమ్ రంగంలోకి దిగి, బిహార్‌కు వెళ్లి నిందితుడిని అరెస్టు చేశారు. బిహార్‌కు చెందిన బాధిత బాలిక కుటుంబం మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్ ఈస్ట్ ఏరియాలో స్థిరపడింది. అక్కడే సొంతిల్లు కూడా ఉంది. అయితే, బాలికకు క్యాన్సర్ ఉండటంతో ముంబయిలోని ఓ ఆస్పత్రిలో కీమో థెరపీ చేయించుకుంటోంది. అయితే, బాలిక కుటుంబానికి నిందితుడు సూరజ్ సింగ్ సన్నిహితుడు. అందువల్లే రెండు నెలల క్రితం బాలిక కుటుంబం తమ ఇంట్లోని ఒక గదిని అతడికి అద్దెకు ఇచ్చారు. 50 రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై సూరజ్ సింగ్ పలు సార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం కీమో థెరపీ కోసం బాలికను ముంబయిలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్య పరీక్షల్లో షాకింగ్ ఫలితం వచ్చింది. బాలిక కడుపులో పిండం పెరుగుతోందని

గుర్తించారు. బాలికను కుటుంబీకులు ఆరాతీయగా.. సూరజ్ సింగ్ అఘాయిత్యానికి పాల్పడ్డాడని వెల్లడైంది. అప్పటికే పరారీలో ఉన్న సూరజ్‌ను వెతుకుతూ ప్రత్యేక టీమ్‌ను మహారాష్ట్ర నుంచి బిహార్‌కు పంపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా కీలక వివరాలు బయటికి వచ్చాయి. ప్రస్తుతం సూరజ్ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడని సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ బల్వద్కార్ తెలిపారు.

# 11 ఏళ్ల విద్యార్థితో ట్యూషన్ టీచర్ ప్రేమాయణం

ఓ ట్యూషన్ టీచర్ తన దగ్గర చదువుకోవడానికి వచ్చే పిల్లాడితో ప్రేమలో పడింది. అతడు లేకుండా ఉండలేననుకుంది. అతడు కూడా టీచర్‌ను ప్రేమించాడు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోయారు. ఈ నేపథ్యంలోనే ఇళ్లు విడిచిపారిపోయారు. చివరికి కథ అడ్డం తిరిగి.. టీచర్ జైలు పాలైంది. ఈ సంఘటన గుజరాత్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుజరాత్, సూరత్‌లోని శామ్లాజీకి చెందిన 23 ఏళ్ల యువతి స్థానికంగా ఉండే పిల్లలకు ట్యూషన్ చెబుతూ ఉంటుంది. 11 ఏళ్ల బాలుడు కూడా ఆమె దగ్గర ట్యూషన్ చెప్పించుకుంటూ ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే టీచర్‌కు, బాలుడికి మధ్య స్నేహం ఏర్పడింది. ఆ స్నేహం కాస్తా ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలోనే ఇద్దరూ ఇల్లు విడిచిపోయి దూరంగా బతకాలనుకుని పారిపోయారు. పిల్లాడు ఎంతకీ ఇంటికి రాకపోయే సరికి అతడి తల్లిదండ్రులు భయపడ్డారు. ఈ నేపథ్యంలోనే వెతుకులాట మొదలుపెట్టారు. వీధిలో ఉండే సీసీటీవీలను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. బాలుడు టీచర్‌తో పాటు వెళుతున్న దృశ్యాలు అందులో రికార్డు అయ్యాయి. బాలుడి తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీస్ టీంలు వారి కోసం అన్వేషణ మొదలుపెట్టాయి. టీచర్, బాలుడు మొదట అహ్మదాబాద్ చేరుకున్నారు. తర్వాత వడోదరా నుంచి ఢిల్లీ వెళ్లారు. అక్కడినుంచి నేరుగా జైపూర్ వెళ్లారు. జైపూర్‌లోని ఓ హోటల్‌లో రెండు రోజులు ఉన్నారు. వీరి గురించి సమాచారం అందుకున్న పోలీసులు గుజరాత్.. రాజస్థాన్ బార్డర్‌లో అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు టీచర్‌ను విచారించగా షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. పిల్లాడి కారణంగా తను గర్భం దాల్చానంటూ ఆమె బాంబు పేల్చింది.

దీంతో టీచర్‌తో పాటు పిల్లాడిని కూడా వైద్య పరీక్షల కోసం పంపారు. పోలీసుల విచారణలో మరో విషయం కూడా బయటపడింది. బాలుడి వయసు 11 సంవత్సరాలు కాదని.. 13 సంవత్సరాలని తేలింది. పోలీసులు.. టీచర్‌ను కోర్టు ఎదుట హాజరుపరిచారు.

## అమెరికాలో స్కూలు పిల్లలతో టీచర్ ఎఫైర్..

# 30 ఏళ్ల జైలు శిక్ష

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి సక్రమ మార్గంలో పెట్టాల్సిన ఉపాధ్యాయులే తప్పుదోవ పడుతున్నారు. కన్నబిడ్డల్లా చూసుకోవాల్సిన వారిపై కన్నేస్తున్నారు. వారితో తమ కామ కోరికలు తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. మగ ఉపాధ్యాయులే కాదు.. ఆడవారు కూడా మగ విద్యార్థులతో తప్పుగా ప్రవర్తిస్తున్నారు. మగ విద్యార్థులతో ఎఫైర్ పెట్టుకున్న కారణంతో ఓ టీచర్ భారీ మూల్యాన్ని చెల్లించుకుంది. చేసిన నేరం రుజువవ్వటంతో కోర్టు ఆమెకు ఏకంగా 30 ఏళ్ల జైలు శిక్ష వేసింది. చేసిన తప్పుకు సదరు లేడీ టీచర్ ఇప్పుడు కుమిలికుమిలి ఏడుస్తోంది. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. అమెరికాకు చెందిన 36 సంవత్సరాల జాక్వెలిన్ శాండియాగోలోని లింకన్ ఎకర్స్ ఎలిమెంటరీ స్కూల్లో టీచర్‌గా పని చేస్తూ ఉండేది. జాక్వెలిన్ తను చదువు చెప్పే ఓ 12 ఏళ్ల విద్యార్థిపై కన్నేసింది. అతడ్ని మచ్చిక చేసుకుని తన కోరికలు తీర్చుకుంటూ ఉండేది. దాదాపు 10 నెలల పాటు అతడితో ఎఫైర్ పెట్టుకుంది. అతడికి లవ్ లెటర్స్ పంపేది. ఇద్దరూ ఫోన్‌లో చాట్ కూడా చేసుకునే వారు. లవ్ లెటర్లు, మెసేజ్‌లు చూసి బాలుడి తల్లికి అనుమానం వచ్చింది. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. జాక్వెలిన  కేవలం ఆ బాలుడితో మాత్రమే కాదు.. చాలా మందితో ఎఫైర్ పెట్టుకుంది. విద్యార్థులకు బహుమతులు, తిండితో పాటు వారిపై ప్రత్యేకమైన శ్రద్ధ చూపించేది. వాళ్ల హోంవర్క్ కూడా చేసేది. దీంతో పిల్లలు ఈమె వలలో పడిపోయేవారు. చెప్పినట్లు చేసేవారు. కోర్టులో జాక్వెలిన్ నేరం రుజువవ్వటంతో కోర్టు ఆమెకు 30 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చింది.

# ప్రైవేటు ఆస్పత్రుల ధనదాహం

# ఏడు నెలల గర్భిణి మృతి

ఏడు నెలల గర్భవతి.. ఉన్నట్లుండి నొప్పులు రావడంతో తీవ్రంగా ఇబ్బంది పడింది. దాంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రాణం పోయాల్సిన వైద్యులు.. ఏకంగా పది లక్షల రూపాయలు డిమాండ్ చేశారు. అంత సొమ్ము లేదని చెప్పడంతో.. ఆస్పత్రిలో చేర్చుకోలేదు. ఎంత బతిమిలాడినా కనికరించలేదు. చేసేదేంలేక మరో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె పరిస్థితి విషమించింది. చివరకు కన్ను మూసింది. పాపం ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చి మురిసిపోవాల్సిన తల్లి.. వైద్యుల నిర్లక్ష్యం, ధన దాహం కారణంగా అర్ధాంతరంగా తనువు చాలించింది. ఈ సంఘటన పూణేలో చోటు చేసుకుంది. పూణేకు చెందిన తనిషా భిసే.. ఏడు నెలల గర్భిణి. మరో రెండు నెలలు ఆగితే కవలలకు జన్మనిచ్చేది. బిడ్డలను తలుచుకుని మురిసిపోతున్న తనిషాకు ఊహించని షాక్ తగిలింది. ఉన్నట్లుండి ఆరోగ్యం పాడయ్యింది. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు తనిషాను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. వెంటనే ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్స అందించాల్సిన వైద్యులు కాస్త ధన పిశాచులుగా మారారు. 10 లక్షల రూపాయలు ఇస్తేనే తనిషాకు చికిత్స చేస్తామని.. లేదంటే ఆమెను అక్కడ నుంచి తీసుకెళ్లాలని తెలిపారు. వారి మాటలు విన్న తనిషా భర్త.. తన దగ్గర అంత మొత్తం లేదని.. 2.5 లక్షల రూపాయలు ఇస్తానని చెప్పాడు. కానీ ఆస్పత్రి యాజమాన్యం అందుకు అంగీకరించలేదు. తనిషాను ఆస్పత్రిలో చేర్చుకోలేదు.. చికిత్స అందించలేదు. దాంతో ఆమె పరిస్థితి మరింత విషమించింది. చేసేదేం లేక తనిషా భర్త.. ఆమెను మరొక ఆస్పత్రికి తరలించాడు. కానీ దురదృష్టవశాత్తు ఆలోపే ఆమె చనిపోయింది. మరో రెండు నెలల్లో కవల పిల్లలకు జన్మనివ్వాల్సిన తనిషా అర్ధాంతరంగా తనువు చాలించడాన్ని.. ఆమె కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోయారు. అంతేకాక వైద్యులు వెంటనే ఆస్పత్రిలో చేర్చుకుని.. చికిత్స ఇచ్చి ఉంటే తన భార్య బతికి ఉండేదని చెప్పుకొచ్చాడు. ఈ సందర్భంగా తనిషా భర్త మాట్లాడుతూ.. "ఆస్పత్రి వాళ్లు.. ప్రాణం కన్నా డబ్బుకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా నా భార్య చనిపోయింది. వారు కనుక వెంటనే ఆస్పత్రిలో చేర్చుకుని ఉంటే నా భార్యకు ఈ పరిస్థితి వచ్చేది కాదు. తను బతికి ఉండేది" అని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా

తనిషా బంధువు ఒకరు మాట్లాడుతూ.. "నేను హెల్త్ మినిస్ట్రీకి చెందిన ప్రత్యేక అధికారినని చెప్పినా సరే ఆస్పత్రి వాళ్లు తనిషాను అడ్మిట్ చేసుకోలేదు. మరో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ఆమె మరణించింది" అని చెప్పుకొచ్చాడు. అయితే ఆస్పత్రి సిబ్బంది ఈ వార్తలను ఖండిస్తుంది. "మా ఆస్పత్రి గురించి మీడియాలో వస్తోన్న సమాచారం అసంపూర్ణం మాత్రమే కాక పూర్తిగా తప్పుడు సమాచారం. దీనిపై మేం ఓ కమిటీని వేశాం. దర్యాప్తు చేసి పూర్తి వివరాలతో నివేదిక అందజేస్తాం" అని తెలిపింది.

# హెచ్ఐవీ రోగుల్లో మహిళలే ఎక్కువ

తెలుగు రాష్ట్రాల్లో 3.53 లక్షల రోగుల్లో మహిళలు 1.93 లక్షల మంది!

హెచ్ఐవీ కేసులు దక్షిణాదిలోనే అధికం 56 శాతం రోగులు ఐదు రాష్ట్రాల్లోనే..

దేశవ్యాప్తంగా 18,36,983 మంది హెచ్ఐవీతో బాధపడుతున్నారు. హెచ్ఐవీ బాధితుల్లో ఎక్కువమంది 10,22,809(56%) మంది దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నారు. హెచ్ఐవీ బాధితుల్లో తెలుగు రాష్ట్రాల్లో 3.53 లక్షల మంది ఉన్నారు. కేసుల పరంగా తెలంగాణ ఐదో స్థానంలో.. ఏపీ రెండో స్థానంలో ఉన్నాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని హెచ్ఐవీ బాధితులు, చికిత్స పొందుతున్న రోగుల గణాంకాలను కేంద్ర గణాంకాలు, ప్రణాళిక మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో హెచ్ఐవీ బాధితుల్లో మహిళలే ఎక్కువగా ఉన్నారు. తెలంగాణలో 1.31 లక్షల మంది బాధితుల్లో.. 60,640 మంది పురుషులు, 69,940 మంది మహిళలు, 780 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఏపీలో 2.22 లక్షల మంది బాధితులుంగా.. వీరిలో పురుషుల వాటా 98,432 కాగా.. 1,23,103 మంది మహిళలు, 810 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా హెచ్ఐవీ బాధితు లంతా చికిత్స పొందుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. హెచ్ఐవీ కేసుల్లో మహారాష్ట్ర లో టాప్‌లో ఉంది. అక్కడ 3,18,492 మంది బాధితులుండగా.. 2.01 లక్షల కేసులతో కర్ణాటక మూడో స్థానంలో ఉంది. తమిళనాడులో 1.37 లక్షల మంది, యూపీలో 1.23 లక్షల మంది హెచ్ఐవీ బాధితులున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న హెచ్ఐవీ బాధితుల్లో.. పురుషులు 9.06 లక్షల మంది, మహిళలు 8.4 లక్షల మంది ఉన్నారు. టీనేజర్లలో 46,925 మంది బాలురు, 36,452 మంది బాలికలు హెచ్ఐవీకి చికిత్స తీసుకుంటున్నారు. టీనేజర్లలో.. తెలంగాణలో 4,278 బాలబాలికలు, ఏపీలో 7,890 మంది బాలబాలికలు ఉన్నారు.

# కన్నతల్లిని కాశీలో వదిలేసిన కోటీశ్వరుడు గంగానదిలో మునిగి వృద్ధురాలు మృతి

కన్నతల్లి పట్ల కర్కశంగా వ్యవహరించాడు ఓ కుమారుడు. రూ.కోట్ల విలువైన ఆస్తులున్నా మాతృమూర్తిని చేరదీసేందుకు అతడి మనసు ఒప్పుకోలేదు. జన్మనిచ్చిన తల్లిని ఉత్తర్‌ప్రదేశ్ వారణాసిలోని బనారస్ ఘాట్‌లో వదిలేశాడు. అయితే మరో వ్యక్తి వృద్ధురాలికి అండగా నిలిచి, వృద్ధాశ్రమంలో చేర్చేలోపు గంగానదిలో మునిగిపోయి తనువు చాలించింది. సత్య విజయ్ సింగ్ అనే వ్యక్తి తన విద్యార్థి బృందంతో కలిసి అకాడమీ టూర్ కోసం బనారస్‌కు వచ్చారు. విద్యార్థులతో కలిసి బనారస్ ఘాట్లపై పెయింటింగ్ వేశారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి 10.30 గంటలకు ఓ వృద్ధురాలు వారికి కనిపించింది. ఆమెకు చీర కట్టమని విద్యార్థినులకు స్థానికులు అభ్యర్థించగా, స్టూడెంట్స్ మహిళకు చీరను కట్టారు. అప్పుడు వృద్ధురాలు ఏడవడం వల్ల వృద్ధురాలి గురించి సత్య విజయ్ సింగ్ ఆరా తీశారు. వృద్ధురాలు స్వస్థలం హైదరాబాద్ అని, ఆమె గత 15 రోజులుగా బనారస్ ఘాట్‌లో తిరుగుతోందని స్థానికులు విజయ్ సింగ్‌కు చెప్పారు. మహిళ ధనిక కుటుంబానికి చెందినదని, ఆమె కుమారుడికి కోట్ల విలువైన ఆస్తి ఉందని వెల్లడించారు. కానీ వృద్ధురాల్ని ఆమె కొడుకే బనారస్ ఘాట్‌లో వదిలి పెట్టి వెళ్లిపోయాడని వివరించారు. దీంతో ఒక్కసారిగా విజయ్ సింగ్ మనసు చలించింది. "వృద్ధురాలి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఆమె షాక్‌లో ఉన్నట్లు అనిపించింది. మా బృందంలోని విద్యార్థులు ఆమెకు బట్టలు మార్చి ఆహారం పెట్టాం. చాలా ఆకలితో ఉన్నట్లు భోజనాన్ని తింది. ఆమెను వృద్ధాశ్రమంలో చేర్పించాలని ప్లాన్ చేశాం. ఆమె బసకు అయ్యే ఖర్చును నేను భరిస్తానని చెప్పాను. అప్పుడు ఆశ్రమానికి వెళ్లేందుకు అంగీకరించింది" అని విజయ్ సింగ్ తెలిపారు. అయితే ఉదయం ఘాట్ వద్దకు వచ్చేసరికి వృద్ధురాలు గంగానదిలో మునిగి చనిపోయిందని తెలిసిందని అన్నారు. ఆ తర్వాత పోలీసులు ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు నమోదు చేశారని పేర్కొన్నారు. బనారస్ ఘాట్‌పై ఒక వృద్ధురాలు ఉందని తనకు ఫోన్ వచ్చిందని సామాజిక కార్యకర్త అమన్ కబీర్ తెలిపారు. ఆమెను వృద్ధాశ్రమానికి తరలించడం గురించి మాట్లాడుకున్నామని వెల్లడించారు. అంతలోనే గంగానదిలో మునిగి చనిపోయిందని తెలిసిందని చెప్పారు. వృద్ధురాలి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు.

# 3 ఏళ్ల చిన్నారికి సంతారా..
## పిన్న వయసులో ప్రపంచానికి వీడ్కోలు..




మధ్యప్రదేశ్‌కు చెందిన మూడేళ్ల చిన్నారి జైన మత ఆచారం ప్రకారం ప్రపంచానికి వీడ్కోలు పలికింది. ప్రపంచంలో అత్యంత పిన్న వయసులోనే ఈ ఆచారం ప్రకారం స్వచ్ఛందంగా మరణించిన వ్యక్తిగా 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో వియానా పేరు నమోదైంది. ఇంతకీ, వియానా మరణం కోసం ఆమె తల్లిదండ్రులు ఈ మార్గం ఎందుకు ఎంచుకున్నారు? సంతారా అంటే ఏమిటి? మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలో జైన సమాజానికి చెందిన ఒక ప్రత్యేకమైన ఆచారం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 3 సంవత్సరాల వయసు గల చిన్నారి మరణాన్ని కౌగిలించుకునేందుకు సంతారా ఆచారం ఎంచుకోవడమే కారణం. సాధారణంగా వృద్ధాప్యంలో ఉన్నవారే స్వచ్ఛంద మరణం కోసం ఈ ఆచారాన్ని స్వీకరిస్తారు. తీవ్ర అనారోగ్య సమస్యలు తట్టుకోలేక చావు కోరుకునే వారు ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. అయితే, బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న పాపకు సంతారా ఇప్పించడంపై అంతటా విమర్శలు చెలరేగుతున్నాయి.

ఈ సంఘటన మార్చి 21న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలో జరిగింది. ఐటీ దంపతులు పీయూష్ జైన్ (35), వర్ష జైన్ (32) బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న కుమార్తె వియానాకు జైన మతాచారం ప్రకారం సంతారా ఇప్పించారు. జీవితపు చివరి క్షణాల్లో కొట్టుమిట్టాడుతున్న కుమార్తెకు తుది వీడ్కోలు పలికారు. వియానాకు ఏడాది కిందట మెదడులో కణితి ఉన్నట్లు నిర్ధారణ అయింది. శస్త్రచికిత్స తర్వాత కోలుకున్నా ఈ ఏడాది మార్చిలో మళ్లీ అనారోగ్యానికి గురైంది. ఇండోర్‌లో, తరువాత ముంబైలో చికిత్స చేసినా పరిస్థితి పెద్దగా మెరుగుపడలేదు. దీంతో పాప తల్లిదండ్రులు జైన్ ముని శ్రీ సలహా

మేరకు ఆమెకు సంతార ఇప్పించారు. మతపరమైన ఈ ప్రక్రియ జరిగిన కొద్ది నిమిషాలకే వియానా మరణించింది. 3 సంవత్సరాల నాలుగు నెలల వయసున్న వియానా జైన్ ఈ ఆచారం స్వీకరించిన అతి పిన్నవయస్కురాలిగా నిలిచి అమెరికాకు చెందిన 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించింది. తల్లిదండ్రుల నిర్ణయాన్ని జైన సమాజం హర్షించి సత్కరించినా.. దేశవ్యాప్తంగా డాక్టర్లు, పలువురు సామాజికవేత్తలు ఈ ఆచారాన్ని నిరసిస్తున్నారు. ఇంత చిన్న వయస్సులో సంతారాను ఇప్పించడం సరికాదని విమర్శిస్తున్నారు. మధ్యప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు ఓంకార్ సింగ్ మాట్లాడుతూ, 'ఈ మతపరమైన ఆచారంపెద్దలకు మాత్రమే. ఆ తల్లిదండ్రుల పట్ల నాకు సానుభూతి ఉంది. కానీ, మరణశయ్యపై ఉన్నప్పటికీ అభం శుభం తెలియని చిన్నారికి ఇలా చేయకూడదు.' అని అన్నారు.

## సంతారా అంటే..

సంతారా అనేది జైన ధర్మంలో ఒక పవిత్ర ఆచారం. దీనిని సల్లేఖన అని కూడా పిలుస్తారు. సంతారా ఆచారం ప్రకారం స్వచ్ఛందంగా చనిపోవాలనే ఉద్దేశంతో ఉన్న వ్యక్తి ప్రాణం పోయేవరకూ ఆహారం, నీటిని ముట్టరు. ఆకలిని, దాహాన్ని ఆపడం ద్వారా ఆత్మ శుద్ధి చెంది చనిపోయాక శాంతి కలుగుతుందని జైనుల విశ్వాసం. సన్యాసం తీసుకున్నప్పుడు, చావుకు దగ్గరగా ఉన్నామని భావించేవారు సంతారా స్వీకరిస్తుంటారు. కఠినమైన ఈ పద్ధతి చట్టవిరుద్ధమని, జైన మతానికి ఈ ఆచారం అవసరం లేదని 2015లో రాజస్థాన్ హైకోర్టు తీర్పు చెప్పింది. కానీ సుప్రీంకోర్టు ఆ తీర్పుపై స్టే విధించి దీనిని చట్టబద్ధం చేసింది.



# భాగస్వాములతో గడిపేలా ఖైదీలకు ఏకాంత గదులు

## కోర్టు ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేసిన ఇటలీ ప్రభుత్వం

## ఖైదీల హక్కుల కార్యకర్తల హర్షం


జైళ్లలో ఉండే ఖైదీలు తమ భాగస్వాములను ప్రైవేటుగా కలిసేలా వారి కోసం ఏకాంత గదులను ఇటలీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఖైదీలు తమ భాగస్వాములను ప్రైవేటుగా కలుసుకునే హక్కు ఉందని అక్కడి న్యాయస్థానం గతేడాది తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇటలీ సర్కార్ ఈ వెసులుబాటు కల్పించింది. సెంట్రల్ ఉంబ్రియా ప్రాంతంలోని జైలులో ఈ ప్రత్యేక సదుపాయాన్ని అధికారులు అందుబాటులోకి తెచ్చారు. దీనిపై ఖైదీల హక్కుల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. అయితే, ఈ తరహా సదుపాయం ఐరోపాలోని చాలా దేశాల్లో ఇప్పటికే అందుబాటులో ఉంది. ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, నెదర్లాండ్స్, స్వీడన్‌లోని కొన్ని జైళ్లలోనూ ఖైదీలకు ఏకాంత గదులు ఉన్నాయి. ఏకాంత గదుల ఏర్పాటు మంచిదే. అయిత దాన్ని వినియోగించుకొనే ఖైదీల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగకుండా చూసుకోవాలి" అని ఖైదీల హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. తమ జీవిత భాగస్వాములు లేదా దీర్ఘకాల సహజీవన భాగస్వాములను ప్రైవేటుగా కలుసుకునే హక్కు ఉందని, ఆ సమయంలో జైలు గార్డులు ఎవరూ అక్కడ ఉండకూడదు అని ఇటలీలోని కాన్‌స్టిట్యూషనల్ కోర్టు గతేడాది జనవరిలో తీర్పు వెలువరించింది. దానికి అనుగుణంగానే అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఐరోపాలోనే అత్యంత కిక్కిరిసిన జైళ్లు ఇటలీలోనే ఉన్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం ఈ దేశంలో 62 వేల మంది ఖైదీలు వివిధ నేరాల్లో శిక్ష అనుభవిస్తున్నారు. జైళ్ల గరిష్ఠ సామర్థ్యం కంటే ఈ సంఖ్య 21 శాతం ఎక్కువ కావడం గమనార్హం. ఇక, గత కొంతకాలంగా ఖైదీల ఆత్మహత్య ఘటనలు పెరుగుతున్నాయి. మానసిక అనారోగ్యంతో పలువురు బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు నివేదికలు వెల్లడించాయి. వీటిని అరికట్టడానికి ఇప్పటికే అధికారులు పలు చర్యలు తీసుకున్నారు. ఖైదీలు తమ కుటుంబ సభ్యులకు ఎక్కువ సార్లు ఫోన్ చేసుకునే వీలు కల్పించారు. తాజాగా భాగస్వాములతో ఏకాంతంగా కలుసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు.

# గుజరాత్ తీరంలో భారీగా డ్రగ్స్

## 300 కేజీల మాదకపదర్థాలు స్వాధీనం

## దాదాపు రూ.1800 కోట్ల విలువ

గుజరాత్ తీరంలో మరొకసారి డ్రగ్స్ కలకలం రేపింది. రూ.1800 కోట్ల విలువైన 300 కేజీల మాదక పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసిజి), గుజరాత్ యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఎటిఎస్) అర్ధరాత్రి నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో ఈ డ్రగ్స్‌ను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయమైన సమాచారంతో ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. అనుమానాస్పద బోట్ కనిపించటంలో అక్కడికి సిబ్బంది వెళ్లింది. దీంతో అందులో డ్రగ్స్ మూటలతో ఉన్న దుండగులు సిబ్బంది రాకను గమనించారు. వెంటనే ఆ సరకును సముద్రంలో పడేశారు. ఆ వెంటనే అంతర్జాతీయ సరిహద్దు వైపు పారిపోయారు. డ్రగ్స్ ముఠా ఆటకట్టించటానికి వెళ్లిన సిబ్బంది వెంటనే నీళ్లలో మునిగిన ఆ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నది. 300 కేజీలకు పైగా నిషేధిత మెథాంఫెటమైన్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పట్టుబడిన ఈ డ్రగ్స్ విలువ రూ.1800 కోట్లను ప్రాథమికంగా అంచనా వేశారు.



# ఫ్యాన్‌తో పరీక్ష పేపర్ల మూల్యాంకనం

## మధ్యప్రదేశ్ ప్రభుత్వ కాలేజీ లెక్చరర్ నిర్వాకం.. నలుగురిపై వేటు

విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఎంతో కీలకమైన ఎగ్జామ్ పేపర్లను ఫ్యూన్ చేత మూల్యాంకనం చేయిస్తున్నారంటే పరిస్థితులు ఎంత దయనీయంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ సంఘటన మధ్యప్రదేశ్, నర్మదాపురం జిల్లాలో చోటు చేసుకుంది. భగత్ సింగ్ ప్రభుత్వ కాలేజీలో ఫ్యూన్ చేత విద్యార్థులు పరీక్ష పేపర్లు దిద్దించిన వార్త స్థానికంగా కలకలం రేపింది. విషయం తెలుసుకున్న విద్యార్థులు ఆగ్రహం పట్టలేక స్థానిక ఎమ్మెల్యే ఠాకూర్‌దాస్ నాగవంశీ వద్దకు వెళ్లి.. ఫ్యూన్ చేత పరీక్ష పేపర్లు దిద్దిస్తే.. తమ భవిష్యత్తు ఏంటి అని ప్రశ్నించారు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకుని.. తమకు న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న యూత్ అఫైర్స్ అండ్ కోపరేటీవ్స్ మినిస్టర్ విశ్వాస్ సారంగ్ కాలేజీ ప్రిన్సిపాల్, నోడల్ ఆఫీసర్‌ని సస్పెండ్ చేసినట్లు తెలిపాడు. అంతేకాక పేపర్ కరెక్షన్ విధులు ఎవరికైతే అప్పగించారో.. ఆ లెక్షరర్, ఫ్యూన్‌ని కూడా సస్పెండ్ చేశామని.. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని తెలిపాడు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. "పేపర్ దిద్దే పనిని గెస్ట్ లెక్షరర్‌కి అప్పగించాము. కానీ అతడా పనిని ఫ్యూన్‌కి అప్పగిస్తాడని అనుకోలేదు" అని చెప్పుకొచ్చాడు.

## గాజాలో దాడుల కంటే.. ఆకలి మరణాలే ఎక్కువ

గాజాపై ఇజ్రాయిల్ సైన్యం వరుస దాడులకు పాల్పడుతూనే ఉంది. ఈ దాడుల వల్ల ఇప్పటికే వేలాది మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. తాజాగా ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల వల్ల 40 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. 125 మంది గాయాలపాలయ్యారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. కాగా, ఇజ్రాయిల్ సైన్యం దాడుల వల్ల మరణించినవారు కొందరైతే.. ఆకలికి తట్టుకోలేక మరెంతో మంది చనిపోతున్నారని మీడియా వెల్లడించింది. ప్రస్తుతం దాదాపు ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు సుమారు 3,500 మంది చిన్నారులు మృత్యువుకు చేరువలో ఉన్నారు. మరోవైపు ఆహార సరఫరాని ఇజ్రాయిల్ సైన్యం అడ్డుకోవడం వల్ల 290,000ల మంది చనిపోవడానికి సిద్ధంగా ఉన్నారని గాజా మీడియా తెలిపింది.

# ఇంటి వద్దే పాఠాలు!

## హోమ్ స్కూలింగ్‌కు పెరుగుతున్న ఆదరణ

## సమస్యలూ ఉన్నాయంటున్న విద్యావేత్తలు

ఇంటి వద్దే పాఠశాల కాన్సెప్ట్ ఇప్పుడు మన దేశంలో బాగా పెరిగిపోతోంది. సంప్రదాయపరంగా చిన్నారులను పాఠశాలకు పంపకుండా ఇంటి వద్దే వారికి విద్యను అందించడమే ఈ 'హోమ్ స్కూలింగ్'. ఈ విధానంలో తల్లిదండ్రులు లేదా గార్డియన్లే నేరుగా పిల్లలకు విద్యను బోధించే బాధ్యతను తీసుకుంటారు. పాఠశాలకు వెళ్లి గంటల తరబడి తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినాల్సిన పనే ఉండదు. తల్లిదండ్రులు, పిల్లల సమయానుకూలాన్ని బట్టి విద్యా బోధన జరుగుతుంది. పిల్లలు తమ అభిరుచులను బట్టి నేర్చుకోవచ్చు. ఇది మన దేశంలో చట్టబద్ధమే. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్), ఈ-పాఠశాల వంటి వేదికలు హోమ్ స్కూలింగ్‌కు మద్దతుగా పనిచేస్తున్నాయి. ఇటీవలి కాలంలో చాలా మంది పిల్లలు కూడా హోమ్ స్కూలింగ్‌నే ఇష్టపడుతున్నారు. హడావిడిగా నిద్ర లేచి ఉరుకులు పరుగులు పెట్టాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రులకు కూడా తొందర ఏమీ ఉండదు. తాపీగా పనులు చేసుకోవచ్చు. ఉదయం లేచీ లేవగానే స్కూలుకు పోవడానికి తయారవ్వాల్సిన పనీ ఉండదు. ఆటలు ఆడుతూ, మ్యూజిక్ వింటూ, బొమ్మలు గీస్తూ ఇష్టమొచ్చినప్పుడు హాయిగా చదువుకోవచ్చు. రోజులో ఎప్పుడైనా చదువుకోవచ్చు. తల్లిదండ్రులే తొలి గురువులు. పుస్తకాల మోత అసలే ఉండదు. చెమటలు కక్కుకుంటూ, వానలో తడుస్తూ, చలికి వణుకుతూ స్కూలుకు పోనక్కరలేదు. ఇదంతా ఊహాజనితం అనుకుంటున్నారా? లేదు. నమ్మండిశా%నమ్మకపొండిశా%చాలా మంది పిల్లలకు ఇది వాస్తవం. మన దేశంలో ఇప్పుడిప్పుడే ఈ తరహా విద్యాబోధనకు ప్రాచుర్యం పెరుగుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు సైన్స్, గణితం, ఆంగ్లం బోధించవచ్చు. అంతేకాదుశా%జీవిత పాఠాలూ నేర్పవచ్చు. నిండా మూడేండ్లయినా నిండని చిన్నారుల్ని డేకేర్, ప్రీ-స్కూల్‌కు పంపితే చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. అప్పటి వరకూ తల్లిదండ్రులు ముద్దుమురిపాల నడుమ పెరిగిన బాలబాలికలు ఒక్కసారిగా వారికి దూరమై వేరే ప్రపంచంలో అడుగు పెడితే ఎలా

ఉంటుంది? 'ఆ వయసులో కనీసం సరిగా తినడం కూడా తెలియదే. అలాంటిది డేకేర్‌లో, ప్రీ-స్కూల్‌లో తోటి పిల్లల రణగొణధ్వనుల మధ్య, ఏడుపులు పెడబొబ్బల మధ్య వారు ఎలా ఉంటారు? చిన్నారులకు విద్యా బోధన ఇలాగేలా మొదలయ్యేది?. కాదు. అందుకే మేము ఇంటి వద్దే మా పాపకు చదువు చెప్పుకుంటున్నాము' అని ఓ మహిళ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఇప్పుడు పిల్లల్ని పాఠశాలలో చేర్చాలంటే అదో పెద్ద ప్రహసనంగా మారిపోయింది. అడ్మిషన్ దొరకాలంటే ప్రవేశ పరీక్ష రాయాలి. ఆ తర్వాత ఇంటర్వ్యూకు వెళ్లాలి. ఈ తంతంతా చూసి పిల్లల్లో ఉత్సాహం నీరుకారిపోతోంది. స్కూలు అంటేనే భయం పట్టుకుంటోంది. ఇక పాఠాలు ఎలా నేర్చుకుంటారు? భయానక వాతావరణంలో ఎలా చదువుకుంటారు? ఇదంతా చూసి విసిగిపోతున్న తల్లిదండ్రులు హోమ్ స్కూలింగ్ వైపు మొగ్గు చూపుతున్నారనడంలో అతిశయోక్తి లేదు. అయితే ఇంటి వద్దే విద్యాభ్యాసాన్ని ఎలా కొనసాగిస్తారు అనే సందేహం కలగక మానదు.

# ఆ విద్యార్థినికి.. 437 మార్కులు



తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపం కొత్తకోట ప్రాంతానికి చెందిన సుహాసిని, ఆలంగాయంలోని ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో ప్లస్ టూ చదువుతోంది. మార్చి 5వ తేది ప్రారంభమైన పబ్లిక్ పరీక్షల కోసం సుహాసిని ప్రతిరోజు స్వగ్రామం నుంచి బస్సులో పరీక్షా కేంద్రానికి వెళుతుంది. 25న జరిగే పరీక్షకు వెళ్లేందుకు ఆమె బస్సు కోసం వేచి ఉండగా, డ్రైవర్ బస్సు ఆపలేదు. దీంతో సుహాసిని వేగంగా వెళుతున్న బస్సు వెనుకాలే పరుగులు తీసింది. కొద్దిదూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ బస్సు ఆపడంతో ఆమె బస్సులో పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్ష రాసింది. ఆ సమయంలో బస్సు వెనుకగా వస్తున్న వాహనచోదకులు సుహాసిని బస్సు వెనుక పరుగులు తీస్తున్న దృశ్యాలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో, డ్రైవర్, కండక్టర్లపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ నేపథ్యంలో ఇటీవల వెలువడిన ఫలితాల్లో సుహాసిని 437 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించింది.

# Form - IV
## (See Rule 8)

Statement about ownership and other particulars of the UDBHAVA Telugu Monthly, Hyderabad, as required under Rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of Publications | : | Monthly |
| 3. Printer's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 4. Publisher's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 5. Editor's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 6. Name and address of Individuals who own the Newspaper | : | M. Madhava Vasu |
| | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |

I, M. Madhava Vasu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

**M. Madhava Vasu**
(Publisher)